


# కృష్ణకాంతుని వీలునామా

బంకించంద్ర చట్టోపాధ్యాయ

కృష్ణకాంతరాయ్ హరిద్రాగ్రామంలో గొప్ప జమీందారు అతడికి జమీమీద ఏటా పదిలక్షలరూపాయల ఆదాయం వస్తుండేది ఆ జమీని కృష్ణకాంతుడూ, అతడి తమ్ముడైన రామకాంతుడూ సమిష్టిగా సంపాయించారు కాని, అన్నదమ్ము లిద్దరూ పరస్పరానురాగం కలవారు కావటంతో, జమీ అంతా కృష్ణకాంతరాయ్ పేరనే వుండేది

రామకాంతుడి కొడు కొక డున్నాడు అతడిపేరు గోవిందలాలు తనూ, అన్నా కలిసి సంపాయించిన జమీ అంతా అన్న పేరనే వుండటంవల్ల ముందుముందు తన కుమారుడి కేమైనా చిక్కులు రావచ్చు ఒకవేళ అన్న హఠాత్తుగా మరణిస్తే, అతడి కొడుకులు ఆ ఆస్తి అంతా తమదే ననవచ్చు అలాంటి చిక్కు రాకుండా ముందే అన్నతో మాట్లాడి సంగతి సందర్భాలు చెప్పి, తనభాగం పంచుకోవటం ఉత్తమం అన్న గట్టినిశ్చయానికి అతడు వచ్చాడు కాని, యీ ప్రస్తావన అన్నదగ్గిర తేవటం ఎలాగా అని అతడు ఆలోచిస్తూవుండగానే, ఒకనాడు పొరుగూరుకు పోయి, అకస్మాత్తుగా జబ్బు చేసి కాలధర్మం చెందాడు

ఇప్పుడు కృష్ణకాంతుడు జమీ అంతా తనదే నన్నా అడిగేవారులేరు కాని అతడి కలాంటి దురాలోచన ఏకోశానాలేదు తన తమ్ముగి కుమారుడైన గోవిందలాలును తన ఇంటనే వుంచుకుని, తన కన్నకుమారుడిలా అతణ్ణి ఆదరించగాసాడు అంతేకాక, అత డొక వీలునామా తయారు చేసి, తనకు ఆస్తిలో రావలసిన సగభాగం గోవిందలాలుకు చెందేటట్టు అందులో రాశాడు

కృష్ణకాంత్‌రాయ్‌కి ఇద్దరు కుమారులూ, ఒక కుమార్తె వున్నారు పెద్దవాడి పేరు హరలాలు, రెండోవాడిపేరు వినోదలాలు, కుమార్తెపేరు శైలవతి కృష్ణ కాంతుడు తన మరణానంతరం ఆస్థిలో ఎనిమిదణాలవంతు తన తమ్ముడి కొడుకైన గోవిందలాలుకు చెందేటట్లు రాశాడు పోగా మిగిలిన ఎనిమిదణాల భాగంలో తన హరలాలు వినోదలాలులకు మూడేసి అణాలభాగం, భార్యకు ఒక అణా భాగం, శైలవతికి ఒక అణాభాగం రాశాడు

హరలాలుకు యీ విషయం తెలియవచ్చింది అతడు ఉగ్రుడయాడు వస్తుతా మనిషి అవినీతిపరుడు చిన్ననాడే దుష్టసహవాసాలకు అలవాటుపడి తండ్రిమాటవినక ఆయనను ఎదిరించటంకూడా నేర్చుకున్నాడు అతనికి వివాహం అయింది, ఒక కుమారుడుకూడా వున్నాడు

హరిలాలు కస్సుబుస్సుమంటూ తండ్రిదగ్గిరకు వచ్చి, "మీ వీలునామావిషయం తెలిసింది గోవిందలాలుకు ఆస్తిలో ఎనిమిదణాలవంతూ, మాకు మూడేసి అణాల వంతూ రాశా వెందుకని ?" అని అడిగాడు

"అలా రాయటమే ధర్మం గోవిందలాలు తండ్రికి చెందవలసినభాగం అతడి కిచ్చాను," అన్నాడు కృష్ణకాంతుడు

"గోవిందలాలుతండ్రికి ఆస్తిలో ఎలాంటి వాటాకూడాలేదు ఈ జమీ అంతా మా పిత్రార్జితం పైగా మా తల్లికీ, చెల్లెలికీకూడా అణాభాగం ఎందుకివ్వాలి? కుటుంబంలో నేను జ్యేష్ఠుణ్ణి నా తల్లీ, చెల్లెళ్ళ పోషణభారం నాది అలాంటప్పుడు ఆస్తిలో వాళ్ళకు భాగా లెందుకు?" అని రెట్టించాడు హరలాలు

"అబ్బాయీ, యీ పిచ్చిప్రశ్నలన్నీ వెయ్యకు ఆస్తి నాది, దాన్ని ఎవరి కే విధంగా యివ్వాలనుకుంటే, ఆ విధంగా యిచ్చేహక్కు నాకున్నది," అన్నాడు కృష్ణకాంతుడు విసుగ్గా

కృష్ణకాంతుడు ఆరోజే వీలునామా చించిపారవేసి, మరొక వీలునామా రాయించాడు ఇందులో గోవిందలాలుకు ఎనిమిదివంతులు, రెండవకుమారుడైన వినోదలాలుకు అయిదువంతులు, భార్య కొకవంతు కుమార్తె కొకవంతు, హరలాలుకు ఒక్కవంతు చెందేటట్లు చేశాడు ఈ వీలునామా సంగతి వినగానే, హరలాలు తండ్రివి ఒకటికి రెండుసార్లు దూషించి, ఇల్లు వదిలి కలకత్తా వెళ్ళిపోయాడు.

వారంరోజుల తరవాత కలకత్తానుంచి కృష్ణకాంతుడి కొక వుత్తరం వచ్చింది అందులో హరలాలు యిలా రాశాడు కలకత్తా నగరంలో వున్న పండితులంతా విధవా వివాహం శాస్త్రసమ్మతం అని చెపుతున్నారు నేను ఒక విధవను వివాహ మాడదలిచాను మీరు వీలునామా తిప్పిరాయించి, అందులో నాకు ఎనిమిదణాలభాగం యిచ్చేటట్టయితే, నే నా ప్రయత్నం మానుతాను

కృష్ణకాంతుడు ఆ వుత్తరం చదివి దూరంగా విసిరివేసి కొడుక్కు యిలా రాశాడు నీవు నా పుత్రుడివి కావు, నా యిష్టమొచ్చినవారికి నా స్వార్జితం పంచి యిస్తాను ఇందువల్ల నీవు మరింత నష్టపడబోతున్నావు

ఈ ఉత్తరం అందిన కొద్దిరోజుల తరవాత హరలాలు తండ్రికి తాను విధవా వివాహం చేసుకున్నట్టు ఉత్తరం రాశాడు కృష్ణకాంతుడు తన వీలునామా చించివేసి కొత్తది రాశేందుకు పొరుగున వున్న బ్రహ్మానందఘోషుకు కబురు చేశాడు బ్రహ్మానందుడు రాగానే అతడికి కొత్త వీలునామా రాయవలసివున్నదని చెప్పి,

అందులో వుండవలసిన వివరాలమాటకూడా చెప్పాడు బ్రహ్మానందుడు భోజనం ముగించుకుని వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు

## 2

బ్రహ్మానందఘోష మధ్యాన్నం భోజనం చేసి, కొత్త వీలునామా రాసేందుకు కృష్ణకాంతుడిదగ్గిరకు బయలుదేరుతున్నంతలో, హరలాలు అతడి ఇంటికి వచ్చాడు హరలాలును చూస్తూనే బ్రహ్మానందుడు ఆశ్చర్యపడి "కలకత్తానుంచి ఎప్పు డొచ్చావు, హరలాల్ ?" అని ప్రశ్నించాడు

"గ్రామానికి రెండురోజుల క్రితమే వచ్చాను. ఈ రెండురోజులూ అక్కడా యిక్కడా తలదాచుకోవటం జరిగింది. అదిసరే; నాన్నగారు మళ్ళీ కొత్త వీలు నామా రాయించుతున్నారట నిజమేనా ?" అని అడిగాడు హరలాలు.

"నిజమే. నే నిప్పు డాయన దగ్గిరకే వెళ్ళబోతున్నాను." అన్నాడు బ్రహ్మానందుడు.

"ఈసారి రాయబోయే వీలునామాలో నాపేర చిల్లిగవ్వకూడా రాయరని విన్నాను. సరే, ఒక్కమాట. ఒక చిన్నపని చేసి, పెద్దమొత్తంలో డబ్బు సంపాయించా లని వున్నదా ?" అన్నాడు హరలాలు.

"ఏం చేయాలి ?" అన్నాడు బ్రహ్మానందుడు.

"కాస్త మోసం చేయగలిగితే చాలు. ఇదిగో యీ అయిదువందల రూపాయిల నోటు తీసుకో," అంటూ హరలాలు ఒక అయిదువందలరూపాయిల నోటును బ్రహ్మానందుడి కివ్వచూపాడు.

బ్రహ్మానందుడు ఆశ్చర్యానందాలతో ఆ నోటు నందుకుని, "యీ నోటు తీసికుని ఏం చేయమన్నావు ?" అని అడిగాడు.

"ముందు రెండు కలాలను ఒకేరకంగా వుండేటట్టు చెక్కు," అన్నాడు హరలాలు. బ్రహ్మానందుడు మారుమాటాడకుండా రెండు రెల్లుపుల్లలు తీసుకుని నింపాదిగా రెండుకలాలు చెక్కి వాటితో ఒక కాయితంమీద రాసి చూశాడు రెండిటి రాతా ఒకేమాదిరిగా వున్నది.

హరలాలు ఆ కాయితాలు తీసుకుని కాసేపు పరీక్షగా చూసి "భేష్ మనం జయిస్తాం," అంటూ బ్రహ్మానందుడికి రెండు స్టాంపుకాయితా లిచ్చి "ఇందులో ఒకదానిని ని వ్విక్కడే రాయాలి. ప్రారంభించు," అన్నాడు

బ్రహ్మానందుడు కలాన్ని సిరాబుడ్డిలో ముంచి రాయటానికి సిద్ధపడ్డాడు హరలాలు యిలా చెప్పాడు ఇది కృష్ణకాంతరాయ్ రాసిన వీలునామా — నా అనంతరం వా

ఆస్తి అంతా యీ క్రిందివిధంగా విభజింపబడాలని కోరుతున్నాను గోవింద లాలుకు కానీ భాగము, వినోదలాలుకు మూడణాల భాగము, భార్యకు కానీ భాగము, కుమార్తెకు కానీ భాగము, హరలాలుని కుమారుడికి కానీభాగము — మిగిలిన పండెండణాల భాగము నా జ్యేష్ఠ పుత్రుడైన హరలాకు చెందవలెను

బ్రహ్మానందుడు రాయటం ముగించి, "బాగానేవుంది. రాత పూర్తయింది. చేవ్రాళ్ళు చేసేవా రెక్కడ?" అని అడిగాడు చిరునవ్వు నవ్వుతూ.

హరలాలు ఆ కాయితాన్ని తీసుకొని, "ఆ చేవ్రాళ్ళన్నీ నేనే చేస్తాను," అంటూ కృష్ణకాంతుడి చేవ్రాలూ, మరినలుగురు సాక్షుల చేవ్రాళ్ళు చేసేశాడు.

బ్రహ్మానందుడు ఆ సంతకా లన్నీ పరీక్షించి చూసి, "ఫోర్జరీ చేవ్రాళ్ల చేయటంలో నువ్వు చాలా ఘటికుడిలా వున్నావు. ఈ వీలునామా చూసి మీ నాన్నగా రేమంటారో తెలుసుకోవలసివున్నది," అన్నాడు.

"ఒక్క ఫోర్జరీలేకాదు, హస్తలాఘవంలోకూడా నేను ఘటికుణ్ణి," అంటూ హరలాలు పెద్దగా నవ్వి, "నీవూ కొంత హస్తలాఘవం చేసి చూపవలసివున్నది. మా నాన్నగారిదగ్గరకు వెళుతున్నావుగదా, యీ కాగితం రహస్యంగా తీసుకుపో. ఆయనగారు చెప్పినవిధంగానే యీ రెండోకాగితంమీద వీలునామా అంతా రాసి, ఒకసారి చదివి వినిపించి, ఆయనగారు చేవ్రాలు చేయగనే నీవుకూడా చేవ్రాలు చేశేందుకు తీసుకో. నీవు చేవ్రాలు చేసే సమయంలో కాయితాలు మార్చి యిప్పుడు మనం రాసిన వీలునామా ఆయనగారి కిచ్చి, ఆయన రాయించినదానిని తెచ్చి నాకివ్వు. ఆతరవాత ఆ అయిదువందలనోటూ నీ సొంతమయిపోతుంది," అని చెప్పి వెళ్ళిపోయాడు.

బ్రహ్మానందుడు వీలునామా రాసి కృష్ణకాంతుడి ఇంటినుంచి తిరిగి వచ్చేసరికి, హరలాలు అతడికోసం ఎదురుచూస్తున్నాడు. బ్రహ్మానందుడు గడప దాటి లోపలికి రాగానే, హరలాలు ఆదుర్దాగా, "ఏమయింది? పని పూర్తిచేశావా?" అని అడిగాడు.

బ్రహ్మానందుడు నిరుత్సాహంగా తలాడిస్తూ, "ఎన్నో విధాల ప్రయత్నించాను; విఫలుణ్ణయాను. నేను నిజంగా పిరికివాణ్ణి. ఇదుగో నీ డబ్బు, యిదుగో నువ్వు కల్పించిన వీలునామా," అంటూ అతడు పెట్టెలోంచి వాటిని తీసి హరలాలుకు యిచ్చివేశాడు.

హరలాలు ముఖం కందగడ్డలా చేసుకుని, "నువ్వొట్టి పనికిమాలినవాడవు, మూర్ఖుడివి. సరే, నేను పోతున్నాను. ఒకటి గుర్తుంచుకో: యీ రహస్యం మరెవరి

తో నైనా చెప్పావో, నీ ప్రాణాలు నిలువునా తీస్తాను.'' అంటూ అతడు బ్రహ్మా నందుడి వంటయింట్లోకి వెళ్ళాడు.

వంటయింట్లో బ్రహ్మానందుడి సోదరుడికుమార్తె రోహిణి వంటచేస్తున్నది ఈమె చిన్నతనంలోనే విధవరాలయింది. ఇప్పుడామె సంపూర్ణయవ్వని. రూపలావణ్యాల్లో షోడశకళాప్రపూర్ణుడైన శరత్కాల చంద్రుణ్ణి మరపించగలదని కొందరు కవి కుమారులు అంటూండేవాళ్ళు. వితంతువైనా ఆమె నల్లని చీరెలు ధరించేది చేతు లకు గాజులు తొడుక్కునేది. తాంబూలంకూడా వేసుకుంటుం దని ఆమె నెరిగిన కొంద రాడవాళ్ళు చెపుతూంటారు.

హరలాలు గదిలోకి రాగానే రోహిణి పొయ్యిదగ్గరనుంచి లేచి మేలిముసుగు సవరించుకుంటూ నిలబడి, "ఎప్పుడు రావటం?" అన్నది.

"నిన్ననే వచ్చాను. నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి," అన్నాడు హరలాలు

"అంత ముఖ్యవిషయమా! సరే. యీ పూట యిక్కడే భోజనంచెయ్యి." అన్నది రోహిణి.

"భోజనంమాట కేంగాని, యిప్పుడు, జరిగిపోయిన ఒకసంగతి నీకు గ ర్తుచేయ దలిచాను చాలాకాలంక్రితం నీవు కొందరు యాత్రికులతో కలిసి గంగాస్నానానికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు దారితప్పి ఒక మైదానంలో తిరుగుతున్నావు: అంతలో చీకటి పడింది కొందరు దుర్మార్గులు నిన్ను పట్టుకోవటానికి వచ్చారు. అప్పుడు నిన్ను వాళ్ళబారినుంచి రక్షించినవా శ్వెవరు?'' అన్నాడు హరలాలు.

రోహిణి సిగ్గుపడుతూ, "మరెవరో ఎలాఅవుతారు? నువ్వే నన్ను రక్షించావు ఆ సమయంలో నువ్వు గుర్రంమీద ఎక్కడికో పోతూ అటుగా వచ్చావు." అన్నది

"ఆ ఉపకారానికి ప్రత్యుపకారం చేయగలవా?"

"ఏమిటో చెప్పు, నా ప్రాణాలైనా ధారపోసి చేసేందుకు ప్రయత్నిస్తాను

రోహిణి యిలా అనగానే హరలాలు ఆమెకు కృష్ణకాంతుడి వీలునామా గురించి చెప్పి, "నువ్వాయన దగ్గరనుంచి ఆ వీలునామా కాజేసుకురావాలి. దాని స్థానంలో నే నిచ్చే కల్పిత వీలునామా వుంచాలి. నువ్వు తరచుగా మా ఇంటికి వస్తూ పోతూం టావు గనక, ని న్నెవరూ అనుమానించరు." అన్నాడు.

"దొంగతనమా? నన్ను చంపినా నే నాపని చేయలేను; అంత విశ్వాసఘాతుక కృత్యం నావల్లకాదు," అంటూ రోహిణి వెలవెల పోయింది

హరలాలు ఒక వేయిరూపాయిలనోటు ఆమె చేతి కిచ్చి, "ఈ సొమ్ము నీది మూరు మాటాడకుండా నేను చెప్పినపని చేసిపెట్టు నా వుపకారానికి యీ జన్మలో నువ్వు చెయ్యగల ప్రత్యుపకారం యిదే," అన్నాడు

రోహిణి నోటును హరలాలుకు యిచ్చివేసి, "నీ వేమీ నాకు డబ్బు యివ్వ నవసరంలేదు వీలయితే నీ పని పూర్తయ్యేలా చూస్తాను," అని చిరునవ్వు నవ్వుతూ, "యీమాట నిజమేనా ? నువ్వు కలకత్తాలో విధవావివాహం చేసుకున్నావా ?" అని అడిగింది

"చేసుకోవాలనే వున్నది కాని, నా మనస్సుకు నచ్చిన విధవ ఎవరూ తటస్థపడ లేదు," అన్నాడు హరలాలు

"విధవో సధవో ఎవరో ఒకర్ని పెళ్ళి చేసుకుని మళ్ళీ ఒక గృహస్థు వయితే, మే మంతా ఎంతగానో సంతోషిస్తాం," అన్నది రోహిణి

"విధవావివాహం శాస్త్రసమ్మతం అని అందరూ అంటున్నారు," అన్నాడు హరలాలు

"నేనూ అలా అనే విన్నాను '

"కావాలంటే నువ్వూ వివాహం చేసుకోవచ్చు ఎందుకు చేసుకోకూడదూ ?" అన్నాడు హరిలాలు గొంతు తగ్గించి రోహిణి మేలిముసుగుతో ముఖమంతా కప్పుకుని తల తిప్పుకున్నది

"ఈ మాట విన్నావా? గ్రామంలో అందరూ మనిద్దరిమధ్యా చాలాకాలంగా ఏదో కథ నడుస్తున్నదని చెప్పుకుంటున్నారు ఆలాంటి దీ నిమిషంవరకూ ఏంలేదుగదా "

హరలాలు అలా అంటూండగానే రోహిణి చప్పున వెనుదిరిగి పొయ్యిదగ్గిరకు వెళ్ళి విసనకర్రతో పొయ్యిని విసరసాగింది హరిలాలుకొంచంగా వ్యాకులపడి, ఆమె కేసి ఒకమారు తీక్షణంగా చూసి ద్వారంకేసి నడిచాడు అంతలో రోహిణి "నోటు అవసరంలేదు, ఆ వీలునామా ఏదో అక్కడ వుంచిపో" అన్నది హరలాలు వెయ్యి రూపాయలనోటు జేబులో పెట్టుకుని, కల్పిత వీలునామాను రోహిణిపక్కన పడవేసి వెళ్ళిపోయాడు

## 3

రాత్రి ఎనిమిదిగంటలవేళ రోహిణి వెళ్ళేసరికి కృష్ణకాంతుడు మంచంమీద ఓరగా పడుకుని హుక్కా పీలుస్తున్నాడు వల్లమందుమత్తులో అతడు ఏవేవో కలలు గంటున్నాడు

కృష్ణకాంతుడు హుక్కామత్తులో కలలుకంటూండగా రోహిణి అతనిదగ్గిరకు వచ్చి "తాతా ! నిద్రపోతున్నావా ?" అని ప్రశ్నించింది.

"ఎవరువారు, నందీశ్వరుడా ?" అన్నాడు కృష్ణకాంతుడు కళ్ళు తెరిచేందుకు ప్రయత్నిస్తూ.

"నందీశ్వరు డెవ్వరుతాతా ?"

"నందీశ్వరుణ్ణే ఎరగవా ! అతగాడు బృందావనంలోని గోపికల నవనీతం అంతా కబళించి వారికి డబ్బివ్వలేదు."

రోహిణి కిలకిల నవ్వి. "నేను నందీశ్వరుణ్ణికాదు, రోహిణిని ! మీ రివ్వాళ రాయించిన వీలునామాలో చేవ్రాలు చేసినట్టు లేదని. మా పినతండ్రి చెప్పాడు. ఆ కాయితం ఒకసారి బయటికి తీసి చూడు, తాతా !" అన్నది.

"నేను చేవ్రాలు చేయలేదా? ఆశ్చర్యంగా వుందే. చేసినట్టు నాకు బాగా గుర్తు." అన్నాడు కృష్ణకాంతుడు.

"అనుమానం ఎందుకు, ఒకసారి చూస్తే సరిపోతుందిగదా ?"

"బావుంది. నువ్వు దీపం తీసుకురా," అంటూ కృష్ణకాంతుడు దిండుకిందినుంచి తాళపుచెవులగుత్తి తీసుకుని, బీరువాదగ్గిరకు పోయి దాన్ని తెరిచి లోపలనుంచి వీలునామా కాయితాన్ని బయటికి తీశాడు. రోహిణి దీపంపట్టుకుని పక్కనే నిలబడింది. కృష్ణకాంతుడు వణకుతున్న చేతులతో కంటికి సులోచనాలు పెట్టుకుని, వీలునామా పరీక్షించి "రోహిణీ ! నాకు ముసలితనంతోపాటు మతిమరుపుకూడా వచ్చిం దను కున్నావా ? ఇదుగో చూడు, నా చేవ్రాలు." అంటూ వీలునామాను రోహిణి కళ్ళ ముందు పెట్టాడు.

"చేవ్రాలు చేసేవుంది. ఈ సంగతి మా పినతండ్రితో చెపుతాను." అని చెప్పి రోహిణి గదినుంచి బయటికి వెళ్ళిపోయింది

* * * * *

అర్ధరాత్రిసమయంలో గదిలో ఏదో చప్పుడై కృష్ణకాంతుడికి నిద్రాభంగ మైంది. అతడు మత్తుగా కనురెప్ప లెత్తి చూసేసరికి గదిలో దీపంలేదు. అంతలో ఎవరో తన దిండుకిందనుంచి తాళపుచెవులగుత్తి తీసుకున్నట్టు అతడి కనుమానం కలిగింది. ఆ వెంటనే బీరువా తెరిచినట్టుగా కిర్రుమన్న ధ్వని వినిపించింది. కృష్ణకాంతుడికింకా నల్లమందుమత్తు వదలలేదు. అత డిప్పుడు నిద్రా జాగ్రదవస్థలమధ్య కొట్టుమిట్టాడు తున్నాడు గదిలో ఏమిజరుగుతున్నదీ అతడికి స్పష్టంగా తెలియటంలేదు. ఎంతో బలవంతంమీద ఒకసారి కళ్ళు తెరిచి చూశాడు. గది అంతా చిమ్మచీకటిగా



వున్నది. ఆ వెంటనే అతడికి తాను జైలులో వున్నా నన్నభావం కలిగింది. లోగడ అరిఘోషు డనే అతడికి సంబంధించిన కేసులో తాను అబద్ధపు సాక్ష్యం యిచ్చివున్నాడు. అందుగ్గాను తనను ప్రభుత్వంవారు కారాగృహంలో వేశారని అతడు తలపోశాడు. అంతలో తాళపుచెవి తిప్పిన చప్పు డైంది. కారాగృహ ద్వారాలు మూసుకున్నవి ! అనుకుంటూ కృష్ణకాంతుడు నిలువెల్లా వణికిపోయాడు. అలవాటు ప్రకారం అతడిచెయ్యి హుక్కా-గొట్టంకేసి వెళ్ళింది, అది దొరకలేదు. ఆశ్చర్యపడుతూ కృష్ణకాంతుడు. 'హరీ' అని పెద్దగా కేకవేశాడు ఎవరూ పలకలేదు. మరొకసారి 'హరీ' అని పిలిచాడు. జవాబులేదు. అతడు తిరిగీ నల్లమందుమత్తు పైకొనగా కళ్ళు మూశాడు. ఆ సమయంలో అతడు రాసిన వీలునామా గది దాటి పోయింది. దాని స్థానంలో కల్పితవీలునామా వుంచబడింది.

ఉదయ మవుతూనే హరలాలు బ్రహ్మానందుడి యింటికి వచ్చాడు. సమయానికి బ్రహ్మానందుడు ఇంట్లోలేడు హరలాలు వంటగదిలోకి వచ్చేసరికి, రోహిణి వంట చేస్తూ కనబడింది. హరలాలును చూసి ఆమె ఏమీ మాట్లాడలేదు.

"ఏమయింది ?" అన్నాడు హరలాలు. రోహిణి జవా బేమీ చెప్పకుండా, తను దొంగిలించితెచ్చిన వీలునామాను హరలాలు కిచ్చింది. హరలాలు ఆత్రుతగా చదివి చూశాడు. అది తన పినతండ్రి రాసిన వీలునామా. అతడి ఆనందానికి అవధులులేవు.

"దీన్ని ఎలా తీసుకురాగలిగావు ?" అన్నాడు హరలాలు.

రోహిణి వీలునామాను హరలాలు చేతినుంచి తీసుకుని, అది కృష్ణకాంతుడి పడక గదిలో వున్న బీరువాలో ఎలా వున్నదో వర్ణించిచెప్పి, తరవాత దాన్ని తనెలా సంగ్రహించిందీ తెలియబరచి, వంటగదిలోనుంచి పక్కనున్న మరొక గదిలోకి వెళ్ళి ఒకటిరెండు నిముషాల్లో తిరిగివచ్చింది. ఇప్పుడామె చేతిలో వీలునామాలేదు.

"ఆ కాగితం ఎక్కడ ? నేనిప్పుడే బయలుదేరిపోవాలి," అన్నాడు హరలాలు.

"అంతతొందర ఏమొచ్చింది ?" అన్నది రోహిణి తాపీగా.

"నేనీ గ్రామంలో యిక వుండకూడదు."

"అయితే నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు."

"ఆ వీలునామా !" అంటూ ఆశ్చర్యపోయాడు హరలాలు.

"అది నాదగ్గరే వుంటుంది," అన్నది రోహిణి నిబ్బరంగా.

"అంటే, అది నా కివ్వవన్నమాట ?"

"నాదగ్గి రుంటే, నీదగ్గి రున్నట్టే."

హరలాలు అనుమానంగా, రోహిణి ముఖంలోకి చూసి, "నా కివ్వనికాడికి దాన్ని ఎందుకు దొంగిలించావ్ ?" అని ప్రశ్నించాడు.

"నీకోసమే దీన్ని దొంగిలించాను. నువ్వు విధవావివాహం చేసుకున్న తరవాత ఆ వీలునామా నీ భార్యపరం చేస్తాను. ఇప్పుడే నీ కిస్తే ఎక్కడైనా పారవేసుకో గలవు," అన్నది రోహిణి.

హరలాలుకు రోహిణి అన్న మాటల్లోని గూఢార్థం అవగాహన అయింది అతడు బతిమాలుతున్నట్టు ముఖం పెట్టి, "అది ఎన్నటికీ జరిగేదికాదు, రోహిణీ ! కావలసినంత డబ్బిడుగు, యిస్తాను !" అన్నాడు.

"లక్షరూపాయలయినా నా కవసరంలేదు. నీ వేది శాస్త్రసమ్మతం అని నా కాశ పెట్టావో, అదే కావాలి," అన్నది రోహిణి.

హరలాలు మండిపోతూ, "నే నేం చేసినా కృష్ణకాంతరాయ్ కుమారుణ్ణే ! దొంగ తనం చేసిన స్త్రీని నే నెన్నటికీ వివాహం ఆడను," అన్నాడు.

రోహిణి తోకతొక్కిన తాచులా లేచి, మేలిముసుగు తీసివేస్తూ, "నేను దొంగనా ? నీవు సత్యసంధుడివా ? నాకు లేనిపోని ఆశలు చూపి, నాచేత దొంగ తనం చేయించినవా శ్చెవరు ? నీచాతినీచుడుకూడా ఆడేందుకు భయపడే అబద్ధాన్ని కృష్ణకాంతుడి కొడుకువైన నీవు ఆడావు. నీవంటి వంచకుణ్ణి వివాహం ఆడాలని ఎంత మందభాగ్యురాలైన స్త్రీకూడా కోరదు. నీ వాడదానివై వున్నట్టయితే చీపురుతో



కొట్టి మరీ యిక్కణ్ణించి తరిమేదాన్ని. మగవాడవుకనక, మర్యాదగా యిక్కణ్ణించి తక్షణం వెళ్ళిపో," అన్నది.

హరలాలు హతాశుడై మరి మాటలాడకుండా వెనుదిరిగి గదినుంచి బయిటికి వెళ్ళిపోయాడు. రోహిణి కళ్ళనుంచి అశ్రువులు సంతతధారగా ప్రవహించి, ఆమె చెక్కిళ్ళనూ, చుబుకాన్నీ తడిపివేసినై.

## 4

మరునాటి సాయంత్రంవేళ గృహకృత్యాలన్నీ ముగించుకుని రోహిణి బిందె తీసుకుని నీటికోసం కొలనుకు బయలుదేరింది. కృష్ణకాంతుడు స్వయంగా తవ్వించిన ఆ కొలనుపేరు వారుణి. గ్రామాని కంతా మంచినీటికి అదే అధారం. ఆ కొలను పక్కనే కృష్ణకాంతుడి పూలతోటా, ఒక ఆరామగృహం వున్నవి.

అది వసంతకాలం. కృష్ణకాంతుడి పూలతోటలో వున్న మామిడి, పనసచెట్లలో నుంచి ఒక గండుకోయిల వుండి వుండి 'కూహూ - కూహూ' అని కూస్తున్నది. రోహిణి కలతపొందిన హృదయంతో ఆ కేక వచ్చినవేపు కేసి చూసింది. ఆమెకు ఎక్కడా కోయిల కనిపించలేదు. కాని, అది మరింత బిగ్గరగా కూయసాగింది.

రోహిణి ఒక్క నిట్టూర్పు విడిచి, "ఛీ, పాడుకోయిల," అనుకుంటూ కొలను మెట్లకేసి నడిచింది. ఆమె మనస్సులో కల్లోలం బయలుదేరింది. తను విధవరాలు.

ఇక యీ జీవితానికి సుఖమంటూ వుండదు. దొరికిన ఒక్క అమూల్య రత్నాన్నీ పోగొట్టుకున్నది. బ్రతుకులో యిక సారం లేదు. అది తెలిసివుండీ...యీ కోయిల కూజితాలకు తనెందుకు వేదనపడాలి.

రోహిణి యిలా వితర్కించుకుంటూ మెట్లన్నీ దిగి కొలనునీటిలో బిందెను ముంచబోయినదల్లా, ఉప్పెనలా దుఃఖం ముంచుకురావటంతో, దాన్ని వదిలి మెట్ల మీద కూర్చుని దుఃఖించసాగింది. కొలనుదరినె వున్న కృష్ణకాంతుడి పూదోటలో ఆ సమయాన గోవిందలాలు పచారు చేస్తున్నాడు. అతడు విశ్రాంతిగృహం మెట్ల మీదినుంచి కొలనుకేసిచూసి, ఇంట్లో ఎవరితోనో పోట్లాడివచ్చిన స్త్రీ ఏడుస్తున్న దనుకున్నాడు. దూరం కావటంవల్ల అతడు రోహిణిని గుర్తించలేదు.

కాలం గడిచింది. సూర్యాస్తమయ మయింది. తోటలో అన్నివైపులా తిరిగి, ఇక యింటికిపోయేందుకు సిద్ధమవుతూ గోవిందలాలు కొలనుకేసి చూశాడు. గంట ముందు తాను చూసిని స్త్రీ యింకా అక్కడే వున్నది. ఆమె ఎదురుగా నీళ్ళబిందె గాలితాకిడికి నీటిమీద అటూ ఇటూ తేలియాడుతున్నది.

గోవిందలాలు చాలా ఆశ్చర్యపడ్డాడు. ఒకవేళ ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినావిడేమో అన్న అనుమానం అతడికి కలిగింది. ఆ వెంటనే గోవిందలాలు కొలనువైపుకు వున్న తోటగేటు తెరుచుకుని నిశ్శబ్దంగా మెట్లు దిగి, రోహిణి పక్కన నిలబడ్డాడు.

గోవిందలాలును చూస్తూనే రోహిణి శరీరం పులకాంకిత మైంది. "రోహిణీ ఇంతసేపట్నుంచీ యిక్కడేమిచేస్తున్నావ్ ?" అన్నాడు గోవిందలాలు.

రోహిణి లేచి నిలబడింది, కాని జవా బేమీ చెప్పలేదు.

"ను వ్వేడుస్తూన్నట్టు కనిపిస్తున్నావ్ ? కారణం ఏమిటి ?" అని ప్రశ్నించాడు గోవిందలాలు.

రోహిణి మాట్లాడేందుకు ప్రయత్నించింది గాని, ఆమె గొంతు పెగలలేదు. హరలాలును నానా చీవాట్లూ పెట్టి, ఇంటినుంచి తరిమిన ఆమె వాక్ప్రవాహం హఠాత్తుగా ఎండిపోయింది

గోవిందలాలు తన ప్రశ్నకు జవాబు రాకపోయేసరికి, రోహిణి ముఖంకేసి పరీక్షగా చూశాడు. అత డెన్నడూ ఆమె నంత నిశితంగా చూసిఎరగడు. రోహిణి మనోహరరూపం అతణ్ణి బలంగా ఆకర్షించింది. అతడు రోహిణిపక్కన మెట్ల మీద కూర్చోబోయినవాడల్లా ఆగి, "రోహిణీ ! నీ దుఃఖానికి కారణం ఏమిటో



నా కెందుకు చెప్పవు? సరే నాతో చెప్పేందుకు అభ్యంతరం ఏమైనా వుంటే. రేపు మా యింటి ఆడవాళ్ళతో చెప్పు. నా చేతనైన సహాయం చెయ్యగలను." అన్నాడు

ఆ మాటలతో రోహిణిలో చలనం కలిగింది ఆమె తల ఎత్తి గోవిందలాలు కేసి చూస్తూ, "నీతో చెప్పరాని రహస్యం నా కేమీలేదు. కాని, చెప్పేందు కిది సమయం కాదు ఏదో ఒకనాడు నన్నుగురించిన సర్వం నీకు చెప్పగలను." అన్నది

గోవిందలాలు మారుమాటాడకుండా మెల్లెక్కి తోటలోకి పోయి, అటునుంచి యింటికి వెళ్ళాడు

అర్ధరాత్రివేళ రోహిణి తనవద్ద వున్న వీలునామా తీసుకుని కృష్ణకాంతుడి ఇంటికి బయలుదేరింది ఇంటిపొడ్డివాకిలి లోపల గడివేయబడివున్నది సింహద్వారం దగ్గిర ఇంటినౌకర్లు నలుగురైదుగురు కూర్చుని, గంజాయి తాగుతూ పదాలు పాడుకుంటున్నారు రోహిణిని చూస్తూనే వాళ్ళు, "ఎవరు నీవు?" అని ప్రశ్నించారు. "సఖి!" అన్నది రోహిణి సఖి అనేది కృష్ణకాంతు నింట పరిచారిక నౌకర్లు రోహిణిని నిరభ్యంతరంగా లోపలికి పోనిచ్చారు.

రోహిణి కృష్ణకాంతుడి పడకగది ప్రవేశిస్తూనే, అతడు పెట్టే గుర్రు విని గాఢ నిద్రలో వున్నాడని గ్రహించింది ఆమె పూర్వంమాదిరిగానే తాళపుచెవులు తీసుకుని బీరువా తెరిచింది ఆ సమయంలో కిర్రుమంటూ ధ్వని అయింది. కృష్ణకాంతుడు

చప్పున కళ్లు తెరిచాడు గురక ఆగిపోవటంతో అతడు నిద్ర లేచా డని రోహిణి గ్రహించింది ఆమె కదలకుండా వుండిపోయింది. "ఎవరువారు ?" అంటూ కృష్ణ కాంతుడు గద్దించి పలకరించాడు రోహిణి జవా బివ్వలేదు.

పడకగదిలో ఎవరో తచ్చాడుతున్నట్టు కృష్ణకాంతుడు గ్రహించి. వాకిలిదగ్గిర కావలివుండే హరి అనే నౌకరుకోసం నాలుగైదుసార్లు కేకలువేశాడు. వాడు పలక లేదు. ఆ సమయంలో కావాలనుకుంటే రోహిణికి పారిపోయే అవకాశం వున్నది

కృష్ణకాంతుడు తలగడకిందినుంచి అగ్గిపెట్టె తీసి ఒక పుల్ల వెలిగించాడు. ఆ వెలు గులో బీరువాదగ్గిర ఎవరో స్త్రీ నిలబడివున్నట్టు అతడికి కనిపించింది. "ఎవరు నీవు?" అన్నాడు కృష్ణకాంతుడు రోహిణి అడుగులో అడుగు వేసుకుంటూ అతడివద్దకు పోయి, "రోహిణిని." అన్నది

కృష్ణకాంతుడు ఆశ్చర్యపడుతూ, "ఈ అర్ధరాత్రి యిక్కడేం చేస్తున్నావు?" అని అడిగాడు.

"దొంగతనం చేస్తున్నాను." అన్నది రోహిణి,

"హాశ్యాలు కట్టిపెట్టు! నీవు దొంగతనానికి రాలేదు. కాని, యీ సమయంలో నీ విక్కడ కనిపించటంవల్ల, నువ్వు దొంగవే అనుకోవాలి." అన్నాడు కృష్ణ కాంతుడు.

"నేను నిజంగా దొంగనే! ఏ వస్తువు దొంగిలించుకుపోయేందుకు వచ్చానో, దాన్ని తమ కళ్ళఎదుటే దొంగిలిస్తాను." అంటూ రోహిణి బీరువా తెరిచి, అందులో కల్పిత వీలునామాస్థానంలో అసలువీలునామా వుంచి, కల్పిత వీలునామాను చించి వేసింది.

"ఆఁ ఆఁ. ఏమి టది ? అలా చించివేస్తున్నా వెందుకు ?" అంటూ కృష్ణకాంతుడు కేకపెట్టాడు రోహిణి నిబ్బరంగా వెలుగుతున్న దీపందగ్గిరకు పోయి, తను చించి వేసిన కాయితపుముక్కల నొక్కొక్కదాన్ని కాల్చి బూడిద చేయసాగింది.

"నువ్వు తగలబెడుతున్న కాగితం ఏమిటి ?" అన్నాడు కృష్ణకాంతుడు.

"కల్పిత వీలునామా "

కృష్ణకాంతుడు జవాబు వింటూనే వణికిపోతూ, "నా వీలునామా! నా వీలునామా ? దా న్నెందుకు తగలబెడుతున్నావు?" అంటూ అరిచాడు.

"మీ వీలునామా భద్రంగానే వున్నది. కావాలంటే చూసుకోండి." అన్నది రోహిణి.



కృష్ణకాంతుడు బీరువాదగ్గరకు వెళ్ళి, అందులో వున్న పెట్టెనుంచి ఒక కాయితం తీసి చదువుకున్నాడు. అది తను రాయించిన వీలునామాయే. అతడు తృప్తిగా దానిని పెట్టెలో పెట్టి, రోహిణికేసి తిరిగి, "రోహిణీ! ఇప్పుడు నీవు కాల్చివేసిన పత్రం ఏమిటి?" అని అడిగాడు.

"అది కల్పిత వీలునామా "

"కల్పిత వీలునామా! దా న్నెవవరు సృష్టించారు? నీ కెక్కడ దొరికింది?"

"దాన్ని సృష్టించినవా శ్ళెవరో చెప్పలేను, కాని అది మీపెట్టెలోనే వున్నది "

"ఆ కృత్రిమవీలునామా నా పెట్టెలో వున్నట్టు నీ కెలా తెలిసింది?" అంటూ కృష్ణకాంతుడు కాళ్ళతో భూమిని గట్టిగా తాటించాడు.

"ఆ సంగతి నేను చెప్పలేను."

"నీవు దొంగతనానికి వచ్చావనేదాంట్లో సంశయానికి ఆస్కారంలేదు. తెల్లవారగానే నిన్ను పోలీసులకు ఒప్పగిందుతాను. ఆ తరవాత నీ తల గొరిగించి, ముఖానికి మసి పూయించి గ్రామంనుంచి వెళ్ళకొట్టిస్తాను. ఈ రాత్రికి నిన్ను నా నౌకర్లు పారిపోకుండా నిర్బంధంలో వుంచుతారు." అంటూ కృష్ణకాంతుడు నౌకర్లును పిలిచి, రోహిణిని వాళ్ళకు ఒప్పగించాడు.

## 5

తూర్పు తెలతెల వారుతూండగా గోవిందలాలు తన పడకగదినుంచి బయిటికి వచ్చి, ఇంటిముందున్న పూలతోటలో అటూయిటూ పచారుచేయసాగాడు. కొద్ది సేపటికల్లా అతిడిభార్య — యింకా పదహారేళ్ళయినా నిండని భ్రమర అక్కడికి వచ్చింది. గోవిందలా లామెను చూస్తూనే, "ఇంత పెందరాళే యిక్కడి కెందు కొచ్చావ్?" అన్నాడు.

"మీ రెందుకొచ్చారు?" అన్నది భ్రమర.

"ఏదో చల్లగాలికోసం. అదికూడా సహించలేవావేం? అన్నాడు గోవిందలాలు.

"సహించకేం, చాలావాటిని సహిస్తున్నాను?" అన్నది భ్రమర చిరుకోపంగా.

"ఆహా, కోపం వస్తే నీ ముఖం ఎంత అందంగా వుంటుంది భ్రమరా? ఏదీ నీ ముంగర ఒక్కసారి యిటుకేసి తిప్పు చూద్దాం," అన్నాడు గోవిందలాలు నవ్వుతూ.

భ్రమర తన భర్తను ఉడికించేందుకు నత్తును తీసి అక్కడ వున్న హుక్కామీద పెట్టి, గోవిందలాలు ముక్కు పట్టుకుని వూపింది. గోవిందలాలు విరగబడి నవ్వసాగాడు. భ్రమర ఆనందానికి అవధులులేవు గోవిందలాలు ఆమెను భ్రమరా, బరమా అనికూడా పిలుస్తుంటాడు. కాని, ఆవేమీ ఆమె తల్లిదండ్రులు పెట్టినపేర్లు కావు వారు పెట్టిన పేరు కృష్ణమోహిని, కృష్ణకామిని, అనంగమంజరి — యీ మూడింటిలో ఏదో ఒకటి అయివుంటుంది. ఆ పేర్లేవీ అత్తవారింటిలో ఎవరికీ తెలియవు ఆమె శరీరచ్ఛాయ కొంచెం నలుపు.

భ్రమరా, గోవిందలాలూ యిలా సరససల్లాపాలలో వుండగా, ఇంటి దాసదాసీ జనం ఎవరి పనుల్లో వారు ప్రవేశించారు. కసవూడ్చే ధ్వనీ, బిందెల్లో నీరు నింపుతున్న శబ్దమూ, వంటపాత్రలను పరిశుభ్రపరుస్తున్న సవ్వడీ వారికి వినిపించ సాగినై. ఉన్నట్టుండి హఠాత్తుగా యీ ధ్వనులన్నీ ఆగిపోయినై. ఇంటి దాసీలు ఒకేసారి ఏమిటో గొడవ గొడవగా మాట్లాడుకోవటం వారికి వినిపించింది. భ్రమర ఆదేమిటో తెలుసుకుందా మని వాళ్ళదగ్గిరకు పోయింది.

భ్రమర అంటే దాసదాసీ జనంలో ఏ ఒకరికీ భయంలేదు. వారిదృష్టిలో ఆమె యింకా చిన్నబాలిక. అంతేకాక ఇంటిపెత్తనం అంతా ఆమె అత్తగారిదీ, ఆడబిడ్డదీ.

భ్రమర రావటం చూసి పరిచారికలు మరింత గడబిడగా మాట్లాడుకోసాగారు. వాళ్ళల్లో ఒకతె, "విన్నావా, చిన్నరాణీ?" అన్నది.

భ్రమర జవాబు చెప్పబోయేంతలో ఒకదాసి. "ఇంత ఘోరం నే నెక్కడా చూడలేదు !" అన్నది. ఆ తరవాత అందరూ ఒకేసారి మాట్లాడసాగారు· ఆ



దుర్మార్గురాలిని చీపురుకట్ట విరిగిందాకా కొట్టాలి. అ దేంతిక్క ! ముక్కుకోసి తరిమేయాలి. తల బోడి చేసి సున్నంబొట్లు పెట్టి, గాడిదమీద ఎక్కించి పరగణా అంతా ఊరేగించాలి.

"ఈ గొడవంతా ఏమిటే ? ఏం జరిగింది ?'' అన్నది భ్రమర విసుగ్గా. పరిచారిక లందరూ ఒకేసారిగా భ్రమరకు తాము విన్నదీ· కన్నదీ చెప్పారు.

భ్రమర అక్కణ్ణించి వెనుదిరిగి భర్తవద్దకు పోయి, తాను విన్న సంగతు లన్నీ అతడికి చెప్పింది. గోవిందలాలు ఏమీ అనకుండా తలవూపి వూరుకున్నాడు.

"దాని అర్థం ఏమిటి ?'' అన్నది భ్రమర.

"రోహిణి దొంగతనానికి వచ్చిందంటే, నేను నమ్మను. నువ్వయినా నమ్మ గలవా ?" అని అడిగాడు గోవిందలాలు.

"నేనూ నమ్మలేను."

"ఎందువలన ?"

"మీ రెండువల్ల నమ్మరో ముందు చెప్పండి." తన భార్య రోహిణి దొంగ కాదని ఎందు కనుకొంటున్నదో గోవిందలాలుకు తెలును. అన్ని విషయాల్లోనూ తన నమ్మకాలూ, అయిష్టాలే ఆమెవికూడా గోవిందలాలు అక్కడినుంచి బయలు దేరబోతూ, "నే నిప్పు డెక్కడికి పోతున్నానో చెప్పగలవా ?" అని అడిగాడు.

"చెప్పగలను," అన్నది భ్రమర చిరునవ్వు నవ్వుతూ

"ఊఁ, మరి చెప్పు చూతాం "


"రోహిణి దగ్గరకు ఆమెను కాపాడేందుకు......"

"నిజం చెప్పావ్ !" అంటూ గోవిందలాలు భ్రమరను ముద్దు పెట్టుకుని, కృష్ణ కాంతుడు నివశించే ఇంటిభాగంకేసి బయలుదేరాడు

గోవిందలాలు వెళ్ళేసరికి కృష్ణకాంతుడు ఇంటిముందు పెద్దహాలులో కొలువుతీరి వున్నాడు. అతడు ఎత్తయిన పీఠంమీద అమర్చిన ఒక ఆసనంలో కూర్చుని వున్నాడు. పక్కన ఒక ముక్కాలుపీటమీద బంగారుహుక్కా వున్నది. అతడు అంబరుతంబాకు పొగను సేవిస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు ఎదురుగా మేలిముసుగు వేసుకుని రోహిణి తలవంచుకు నిలబడివున్నది హాలుకు అటూయిటూ అమర్చిన కుర్చీలలో నాయక్‌లు, గుమాస్తాలు, మున్షీలు, అవల్‌దారులు కూర్చునివున్నారు. కొందరు రైతులు చేతులు కట్టుకుని నిలబడివున్నారు.

గోవిందలాలు రావటం చూస్తూనే, కృష్ణకాంతుడు హుక్కా గొట్టం వదిలి అతడికేసి చూశాడు. గోవిందలాలు ఆయనను సమీపించబోయేంతలో రోహిణి తన మేలి ముసుగును కొంచెంగా తొలగించి గోవిందలాలుకేసి దీనంగా చూసింది. అది గమ నించిన గోవిందలాలు, మనస్సు చివుక్కుమనగా చప్పున తల తిప్పుకుని, "పెద నాన్నా ! ఇదంతా ఏమిటి ? ఏం జరిగింది ?" అని అడిగాడు.

తన సోదరపుత్రుడూ, ప్రేమపాత్రుడూ అయిన గోవిందలాలు అలా ప్రశ్నించ గానే కృష్ణకాంతుడు అతడిని దగ్గరకు పిలిచి, చిన్నగొంతుతో జరిగిన దేమిటో చెప్పి, "ఇదంతా ఆ పనికిమాలినవెధవ హరలాలు పన్నిన కుట్ర అని నా అభిప్రాయం రోహిణి అత డిచ్చిన డబ్బు తిని, అతడు తయారుచేసిన కృత్రిమవీలునామా పెట్టెలో పెట్టి, అక్కడ వున్న అసలు వీలునామా దొంగిలించుకుపోయేందుకు వచ్చివుంటుంది.



కాని నేను సమయానికి మేలుకోవటంతో దొరికిపోయింది. ఆ కల్పిత వీలునామాను చించివేసి, కాల్చి బూడిదచేసింది." అన్నాడు.

"రోహిణి ఏమంటుంది ?" అని అడిగాడు గోవిందలాలు

''ఏమంటుంది ? తను వీలునామా దొంగిలించుకుపోయేందుకు రాలేదని అబద్ధాలాడుతున్నది,'' అన్నాడు కృష్ణకాంతుడు హుక్కాగొట్టాన్ని చేతికి తీసుకుంటూ.

గోవిందలాలు రోహిణి కేసి తిరిగి, "వీలునామా ఎత్తుకుపోవటానికి కాకపోతే, ఆ గదిలోకి అర్ధరాత్రిసమయంలో నీ వెందు కెళ్ళావు ?'' అని ప్రశ్నించాడు.

రోహిణి తల ఎత్తకుండానే గద్గదస్వరంతో, ''నేను మీకు దొంగలా దొరికిపోయాను. మీ యిష్టమొచ్చినట్టు చేయండి. నే చెప్పవలసిం దేమీలేదు." అన్నది.

"చూసావా ఎలాంటి కులటో ?" అన్నాడు కృష్ణకాంతుడు.

''ఈమె నేం చేయాలనుకుంటున్నారు ? పోలీసుస్టేషనుకు పంపదలిచారా ?'' అని అడిగాడు గోవిందలాలు.

''నే నిక్కడుండగా పోలీసుస్టేష నెందుకు ? కోర్టెందుకు ? నేనే స్టేషను, నేనే మేజిస్ట్రేటును. ఈ దుష్టురాలిని జైలుకు పంపటంలో పౌరుషం ఏముంది ? తల గొరిగించి, మసి పూసి, ఊళ్ళోనుంచి వెళ్ళకొడతాను," అన్నాడు కృష్ణకాంతుడు తీవ్రంగా.

"నాన్నా, తరవాత మీ రేమైనా చేయండి. ముందుగా నే నీమెతో ఏకాంతంగా మాట్లాడేందుకు కొంచెం అవకాశం కలిగించండి. ఇంతమందిలో యదార్ధ మేమిటో చెప్పేందు కామె సంశయిస్తూండవచ్చు" అన్నాడు గోవిందలాలు.

కృష్ణకాంతుడు చిరునవ్వు నవ్వుతూ మనసులో, 'ఈ సిగ్గుమాలిన తుంట కూడా తల గొరిగించాల్సిందే. ఈ కాలపు పిల్లకాయలకు సిగ్గెగ్గు లేమీ వున్నట్టు లేదు.' అనుకుని, గోవిందలాలుతో, "సరే, నీ యిష్టమొచ్చినట్టుచెయ్యి." అని చెప్పి, నౌకరొకణ్ణి పిలిచి, "ఈవిణ్ణి తీసుకుపోయి చిన్నరాణి దగ్గర వదిలిపెట్టిరా. పారిపో కుండా చూడమని ఆమెతో చెప్పు." అన్నాడు.

గోవిందలాలు ఇంటికి తిరిగివచ్చేసరికి భ్రమరా, రోహిణీ గదిలో మౌనంగా కూర్చునివున్నారు. భ్రమరం ఏవైనా అనునయవాక్యాలు చెప్పి రోహిణిని ఓదార్చా లని అనుకున్నది. కాని, అలాంటి మాటలు ఆమెను మరింత దుఃఖవివశురాలిని చేయగలవేమో అని భయపడింది.

తనభర్త రావటం చూస్తూనే భ్రమర గదినుంచి బయటికి వచ్చి, అతడితో రహస్యంగా, "రోహిణిని యిక్కడి కెందుకు పంపారు?'' అని అడిగింది.

"ఆమెనుంచి ఒక ముఖ్యవిషయం రహస్యంగా మాట్లాడి తెలుసుకోవాలి. నువ్వు కొంచెంసేపు – మే మిద్దరమూ ఏకాంతంగా సంభాషించేందుకు వీలుగా – నీ గదిలోకి వెళ్ళు,'' అన్నాడు గోవిందలాలు

భ్రమర భర్తమాటలకు కొంచెం ఆశ్చర్యం కనబరచి, మారు మాటాడకుండా అక్కణ్ణించి వెళ్ళిపోయింది. గోవిందలాలు రోహిణిదగ్గరకు వచ్చి, "రోహిణీ! నీవు నిజం చెప్పితే, నిన్ను కాపాడేందుకు నా చేతనైన ప్రయత్నం నేను చేయ గలను." అన్నాడు

''ఒకవేళ నేను నిజం చెప్పకపోతే?" అన్నది రోహిణి నిర్వికారంగా.

''అలాంటి పరిస్థితిలో నీవు పొందబోయే శిక్ష ఏమిటో, మా పెదనాన్నగారు ఇంతకుముందే నీకు చెప్పారుగదా!" అన్నాడు గోవిందలాలు.

''నా ఆత్మ నంటిన కళంకం క్షాళనం కానంతవరకూ, నా శరీరానికి జరగబోయే అవమానాలను నేను లెక్కచేయను. నా దృష్టిలో తల గొరిగించటం గొప్ప అవ మానం కాదు. ముఖానికి మసి పూయిస్తే జరిగే నష్ట మేమిటి? ఒక క్షణంలో కడి గేసుకోవచ్చు." అన్నది రోహిణి.

''నువు సత్యం చెపితే, నిన్నా కళంకం అంటకుండా కాపాడగలను." అన్నాడు గోవిందలాలు.

"అయితే, నీ వడగదలచిన ప్రశ్నలేమిటో అడగవచ్చు."

"నీవు కాల్చివేసిన పత్రం ఏమిటి ?"

"అది కల్పిత వీలునామా "

"అది నీ కెలా దొరికింది ?"

"దాన్ని మీ నాన్నగారి బీరువాలోనుంచి తీసుకున్నాను "

రోహిణి యిలా జవాబు చెప్పగానే గోవిందలాలు ఆశ్చర్యపడి, "మా పెద నాన్నగారి గదిలోనే కల్పితవీలునామా చూశావన్నమాట ! దాన్ని అక్కడికి చేర్చిన వా శ్శెవరై వుంటారు ?" అని అడిగాడు.

ఆ కల్పిత వీలునామా అక్కడ వుంచింది నేనే. నిజమైన వీలునామా రాయబడిన రాత్రే, నేను దానిని దొంగిలించి, ఆ స్థానంలో ఆ కల్పిత వీలునామాని వుంచాను."

"అందువల్ల నీకు కలిగే లాభం ?"

"హరలాలు బతిమాలటంవల్ల ఆ పని చేశాను "

"దానితో నీ పని తీరిపోయిందిగదా మళ్ళీ రాత్రి ఆ గదిలోకి ఏందుకు వెళ్లావు?"

"కల్పిత వీలునామా స్థానంలో, అసలు వీలునామాను వుంచేందుకు."

"ఇంతకూ ఆ కల్పిత వీలునామాలో వున్న దేమిటి ?"

"హరలాలుకు ఆస్తిలో పంద్రెండణాల భాగమూ, నీకు వీసపుభాగమూ."

"రోహిణీ ! అంతా నాకు అయోమయంగా వున్నది. నేను నిమ్న సహాయం చెయ్యమని కోరలేదు. అలాంటప్పుడు అనవసరంగా నాకోసం నీ విన్ని చిక్కులు ఎందుకు కొని తెచ్చుకున్నావో నా కర్థం కావటంలేదు," అంటూ గోవిందలాలు విస్తుపోయాడు

రోహిణి ఏడవసాగింది. ఆమె కన్నీళ్ళు గోవిందలాలు హృదయాన్ని కలవర పరిచినై. అతడు ఏమో అనబోయేంతలో రోహిణి, "సహాయం చెయ్యమని నువ్వు కోరనిమాట నిజమే ! కాన, నీకు సహాయం చేయకుండా నే నెలా వుండగలను ? ఆరోజు ... కొలనుతీరంలో నన్ను చూసినప్పుడు నీ వన్నమాటలు ... అవి జ్ఞప్తికి తెచ్చుకో," అన్నది.

అప్పటికి గోవిందలాలుకు ఆమె మనోభావాలు అర్థమయినై. ఆమె తనను ప్రేమిస్తున్నది. కాని, తను వివాహితుడు ...

"రోహిణీ ! నీకు మరణమో లేక యీ గ్రామం వదిలి ఎక్కడికైనా దూర ప్రదేశానికి పోవటమో తప్ప, మరో మార్గాంతరంలేదు. మరణం కోరదగిందికాదు. నీవు రేపు వుదయమే బయలుదేరి కలకత్తాకు పో; అక్కడ నా స్నేహితు డొక

దున్నాడు. నీ వుండేందుకు ఇల్లూ, యితర ఏర్పాట్లూ అతడు చెయ్యగలడు. నీ పిన తండ్రినికూడా వెంటబెట్టుకు పో." అన్నాడు గోవిందలాలు.

## 6

రోహిణి యింటికి వచ్చింది తన కలకత్తా ప్రయాణాన్ని గురించి పినతండ్రితో చెప్పాలని ప్రయత్నించింది. కాని, సంభాషణ ఎలా ప్రారంభించాలో ఆమెకు తెలియలేదు. అస లామెకు గ్రామం వదిలి పోవాలన్న కోర్కెలేదు. నే నిక్కడ పుట్టాను, యిక్కడే మట్టి అవుతాను. కృష్ణకాంతుడు నా తల గొరిగించనీ, ఊరు నుంచి వెడలగొట్టనీ ... మళ్ళీ తిరిగొస్తాను. ఆ గోవిందలాలును రోజుకు ఒక్క సారైనా చూడకుండా నే నెలా బతకగలను ? నేను విధవను; జీవితంలో నా కానందం, సంతోషం రాసిపెట్టిలేదు. పోనీ, అయినా నేను ప్రేమించిన వ్యక్తిని . కళ్ళారా చూసుకునే హక్కు లేకుండా ఎవరు చేయగలరు..."

రోహిణి యిలాంటి ఆలోచనలతో చాలా సేపు మధనపడి, ఎంతో సేపు దుఃఖించి, చివరకు గోవిందలాలుతో తాను కలకత్తా పో నని నిక్కచ్చిగా చెప్పేందుకుగాను, అతడి ఇంటికి బయలుదేరింది.

గోవిందలాలు వరండాలో కుర్చీలో కూర్చుని వున్నాడు. రోహిణిని చూస్తూనే అతడు, "ఏం రోహిణీ, కలకత్తా ప్రయాణంగురించి మీ పినతండ్రితో చెప్పావా ?" అని అడిగాడు

"నాకే అక్కడికి పోవాలనిలేదు, యింకా ఆయనతో చెప్పటం ఎందుకు ?" అన్నది రోహిణి.

"ఇంతకుముందు వెళ్ళేందుకు యిష్టపడ్డావుగదా ?" అన్నాడు గోవిందలాలు.

"అవును. బాగా ఆలోచించినమీదట నే నీగ్రామం వదిలి బతకలే ననిపించింది."

"అలాఅయితే నే నిక చేయగలిగిన సహాయం ఏమీలేదు నువ్వు కలకత్తా వెళ్ళి పోవటం మనిద్దరికీ క్షేమం," అన్నాడు గోవిందలాలు నిస్పృహగా.

"మనిద్దరికీనా ?" అంటూ రోహిణి గోవిందలాలు కళ్ళల్లోకి చూచింది. గోవిందలాలు తన మనోగతాభిప్రాయం ఏమిటో చెప్పబోయినవాడల్లా చప్పున తలవంచుకుని ముంగిలా వూరుకున్నాడు. రోహిణి పొంగివచ్చేదుఃఖాన్ని అణుచుకుంటూ ఇంటికి తిరిగిపోయింది.

గోవిందలాలు దీర్ఘాలోచనలో పడ్డాడు. రోహిణి తనను గాఢంగా ప్రేమిస్తున్నది తనూ ఆమెను అంత గాఢంగానూ ప్రేమిస్తున్నాడా ?

భ్రమర అడుగులో అడుగు వేసుకుంటూ వదండాలోకి వచ్చి. "ఏమి టా దీర్ఘాలోచన? ఎవర్నిగురించి?" అని ప్రశ్నించింది.

"ఎవర్నిగురించో ను వ్యూహించలేవా?" అన్నాడు గోవిందలాలు.

"మరెవర్నిగురించి? నన్నుగురించే!" అన్నది భ్రమర చిరునవ్వు నవ్వుతూ

"కాదు." అంటూ గోవిందలాలు తల పంకించాడు.

"నన్నుగురించికాదా? ఈ ప్రపంచంలో నన్నుగురించి తప్ప మరెవర్నిగురించి ఆలోచించగలవు?" అని అడిగింది భ్రమర ధీమాగా

"నే నిప్పు డాలోచిస్తున్నది రోహిణిని గురించి."

"అంతా అబద్ధం! ఆ విధవరాలినిగురించి ఆలోచించేందు కేమున్నది?"

"నే నామెను ప్రేమిస్తున్నాను."

"ఇది యింకా పెద్ద అబద్ధం! నీవు ప్రేమించేది నన్ను."

"అదీ నిజమే! నేను రోహిణిని ప్రేమించటంలేదు. ఆమె నన్ను ప్రేమిస్తున్నది." అన్నాడు గోవిందలాలు చేదు మింగినవాడిలా ముఖం పెట్టి.

భ్రమర కోపంగా తల తిప్పుకుని. "ఆ నిర్భాగ్యురాలు నిన్ను ప్రేమిస్తున్నదా? ఆ పిశాచి చచ్చి బూడిద అవటం చూడాలని వున్నది." అన్నది.

"అంత పెద్ద శాపనార్థా లెందుకు భ్రమరా? నీ ప్రియుణ్ణి. నీ సర్వస్వాన్నీ యింకా ఆమె దొంగిలించుకుపోలేదు." అన్నాడు గోవిందలాలు.

"పాపిష్టిది తన ప్రేమగూర్చి నీతో చెప్పిందా?"

"ఆ. ఒకరకంగా చెప్పింది. అందుకే నే నామెను కలకత్తా వెళ్ళిపొమ్మన్నాను. డబ్బుకూడా యిస్తా నన్నాను. కాని. ఆమె గ్రామం వదిలేందుకు అంగీకరించటం లేదు."

"అయితే. నే నా పిశాచికి ఒక హితోపదేశం మనిషిద్వారా పంపుతాను." అంటూ భ్రమర. "క్షీరీ!" అని తన పరిచారికను కేకవేసింది. క్షీరి పరుగుపరుగున వచ్చి తన యజమానురాలి ముందు నిలబడింది.

"నువు రోహిణివాళ్ళ యింటికి వెళ్ళిరావాలి."

"వెళ్ళొస్తాను. పనేమిటో చెప్పండి."

"నే నావిణ్ణి చచ్చిపొమ్మన్నానని. నా మాటగా ఆవిడకు చెప్పిరావాలి."

"అలాగే చెప్పొస్తాను." అంటూ క్షీరి బయలుదేరింది. అంతదూరం వెళ్ళిన క్షీరిని కేకవేసి భ్రమర వెనక్కు పిలిచి. "దాని కామె ఏం జవాబు చెపుతుందో బాగా గుర్తుంచుకుని నాతో చెప్పాలి." అన్నది.

క్షీరి తల వూపి వెళ్ళిపోయి, పది నిమిషాల తరవాత భ్రమరవద్దకు తిరిగి వచ్చింది

"నేను చెప్పమన్న మాటలు చెప్పావా ?"

"చెప్పాను."

"దాని కామె ఏమని జవా బిచ్చింది ?"

''చచ్చేందుకు ఉపాయ మేమిటో మీ యజమానురాలు చెప్పలేదా ? అని అడిగింది," అన్నది క్షీరి

"ఆ ఉపాయంకూడా చెప్పిరా. సాయంకాలంవేళ వారుణికొలనుకు వెళ్ళి, నీళ్ళ బిందెను మెడకు కట్టుకుని కొలనులో మునిగి చావమన్నా నని చెప్పు," అన్నది భ్రమర.

క్షీరి నాలుగైదు నిమిషాల్లో తిరిగివచ్చి, "చెప్పానమ్మా!" అన్నది భ్రమరతో

"ఆమె ఏమన్నది ?"

"మంచిది అలాగే చేస్తాను అన్నది," అని చెప్పింది క్షీరి

అంతవరకూ ఏదో వినోదం చూస్తున్నవాడిలా వుండిపోయిన గోవిందలాలు తన భార్యకేసి కోపంగా చూస్తూ, "ఛీ, ఏమిటీ నువ్వింత హృదయం లేనిదానిలా ప్రవర్తిస్తున్నావ్ ?" అన్నాడు

"నువ్వేం భయపడకు! నీమీద అంత మరులుగొన్న ఆ పాపి ఒక పట్టాన చావదు," అన్నది భ్రమర పళ్ళు కొరుకుతూ.

* * * * *

గోవిందలాలు అలవాటు ప్రకారం సాయంకాలంవేళ తోటకేసి షికారు వెళ్ళాడు. అతడు తోటలో అటూయిటూ కొంతసేపు తిరిగి, కొలనువైపు వున్న విశ్రాంతిమందిరాని కొచ్చి, అక్కడినుంచి కొలనుకేసి చూశాడు. అదే సమయంలో రోహిణి బిందె చంకన పెట్టుకుని కొలనుమెట్లు దిగుతున్నది. ఆమెను చూస్తూనే గోవిందలాలు హృదయం వేగంగా కొట్టుకోసాగింది. అతను రోహిణికేసి చూస్తూ ముందుకు నడవబోయినవాడల్లా చటుక్కున ఆగి, తల వంచుకుని మందిరం లోపలికి వెళ్ళిపోయాడు

పావుగంట గడిచింది. ఆసరికి రోహిణి నీళ్ళబిందెతో ఇంటికి వెళ్ళిపోయి వుంటుం దనుకుంటూ గోవిందలాలు మందిరం బయటికి వచ్చి కొలనుకేసి చూశాడు. అతడిగుండెలు గతుక్కుమన్నవి. బిందె మెట్లకుదగ్గిరగా నీటిమీద తేలియాడు తున్నది. ఆ వెంటనే అతడికి ఉదయం భ్రమర తన పరిచారికద్వారా రోహిణికి చెప్పించిన మాటలు గుర్తువచ్చినై.



గోవిందలాలు పరుగుపరుగున కొలనువగ్గిరకు వచ్చి మెట్లు దిగి నీటిలోకి పరీక్షగా చూశాడు నిర్మలంగా వున్న నీటి అడుగున అతడికి ఒక-స్త్రీ ఆకారం కనిపించింది అతడు వెంటనే నీటిలో దిగి కొంతదూరం పోయి ఆ ఆకారాన్ని రెండుచేతులతో పట్టుకుని పైకెత్తాడు. ఆమె రోహిణి !

రోహిణిలో ఎక్కడా చలనంలేదు ఉఛ్వాస నిశ్వాసలు ఆగిపోయినై. ఆమె మరణించివుంటుందా అన్నభావం కలగగానే, గోవిందలాలు నిలువెల్లా కంపించి పోయాడు. అత డామెను మెట్లమీదికి తీసుకువస్తూ, తోటలో పనిచేస్తున్న సేవకు డొకణ్ణి పెద్దగా కేకవేశాడు.

తోటవాడు అక్కడికి రాగానే, యిద్దరూకలిసి రోహిణిని ఉద్యానవనంలోని విశ్రాంతి మందిరానికి తీసుకుపోయి మంచంమీద పడుకోబెట్టారు. తోటవాడు రోహిణి ముక్కు దగ్గిరా, నోటిదగ్గిరా వేలు పెట్టి చూసి, "అయ్యా, ఇంకా కొంచెం ప్రాణం వున్నట్టు నా కనుమానంగా వున్నది. పొట్టలో చేరిన నీళ్ళను బయిటకి రప్పిస్తే బతకొచ్చు. ప్రయత్నిద్దాం," అంటూ రోహిణిని వెల్లికిలా పరుండబెట్టి, రెండుచేతులతో ఆమె పొట్టను నేర్పుగా ఒత్తసాగాడు. రోహిణి భళుక్కుమని యిన్నినీళ్ళు కక్కుకున్నది తోటవాడు గోవిందలాలు సాయంతో ఆమెను మంచంమీదినుంచి ఎత్తి, గోడదగ్గిరకు తీసుకుపోయి, దానికి ఆన్చి కూర్చోపెట్టాడు.

ఇద్దరూ కలిసి ఆమె చేతులను పైకెత్తి దించుతూ కొంతసేపు ప్రథమచికిత్స చేశారు. కొద్దిసేపటితరవాత రోహిణి కళ్ళు తెరుస్తూనే, "నన్ను బతికించినవా రెవరు ?" అన్నది హీనస్వరంతో,

గోవిందలాలు వికలహృదయంతో, "రోహిణీ, నువ్వు చావాలని ఎందుకు ప్రయత్నించావ్ ?" అని ప్రశ్నించాడు.

"రాత్రనక పగలనక నా హృదయం అందనికోర్కెలతో పరితపిస్తున్నది అటువంటి నేను చావటమే మంచిది," అన్నది రోహిణి

"నిన్ను నీవే ఎందుకింతగా నిందించుకుంటావ్ ? ఇక లే, మీ యింటిదగ్గిర దిగబెట్టి వస్తాను," అంటూ గోవిందలాలు రోహిణిచేయి పట్టుకోబోయాడు

రోహిణి చప్పున మంచంమీంచి దిగి, "నే నొక్కతినే పోగలను," అంటూ బయిటికి నడిచింది తోటవాడు తనపని చూసుకునేందుకు వెళ్ళిపోయాడు. గోవింద లాలు మంచంమీద పడుకుని పొర్లి పొర్లి వచ్చే దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ, "భగవాన్ ! న న్నీ విపత్సముద్రంలోనుంచి దరిజేర్చు. నాకు బల ధైర్యాలు సమకూర్చు. నీ సహాయం లేకపోతే, నేను చావటం తథ్యం ఆ తరవాత భ్రమర కూడా మరణిస్తుంది," అంటూ వాపోసాగాడు

భ్రమర భర్తను వెతుక్కుంటూ అక్కడికి వచ్చింది. గోవిందలాలు ఏదో మనో వ్యధ పడుతున్నాడని గ్రహించి, "ఇంత పొద్దుపోయేవరకూ ఇక్కడే వున్నారేం ?" అని అడిగింది

గోవిందలాలు చప్పున మంచమీంచి లేచి, కిటికీదగ్గిరకు వెళ్ళి బయటికి చూస్తూ, "నువ్వు యింటికి వెళ్ళిపో, నేను మా పెదనాన్నగారిదగ్గిరకు వెళ్ళి వెంటనే తిరిగివస్తాను," అన్నాడు

''మీ రేదో పెద్ద విచారంలో వున్నట్టున్నారు,''

"అలాంటి దేంలేదు అయినా, యిప్పుడు నన్నాట్టే ప్రశ్నించకు. ఇంటికిపో."

''ఆ విచారకారణం ఏమిటో నాకు చెప్పకూడదా?'' అన్నది భ్రమర. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''ఆ కారణం యిప్పుడు చెప్పేదికాదు,'' అంటూ గోవిందలాలు కిటికీనుంచి వెను దిరిగి, ''ఈ నాటినుంచీ రెండు సంవత్సరాల తరువాత సాధ్యమైతే చెపుతాను," అంటూ కృష్ణకాంతుడి భవనంకేసి వెళ్ళాడు.

కృష్ణకాంతుడు, గోవిందలాలు రావటం చూస్తూనే కొంచెం ఆశ్చర్యపడి, ''ఏమిటీ, వేళ కాని వేళ వచ్చావ్ ?'' అని ప్రశ్నించాడు.

గోవిందలాలు ఆయన దగ్గిరగా కూర్చుని, "మన జమీందారీ వ్యవహారాలు ఎలా వున్నవో తెలుసుకోవాలని వున్నది. ఏదో ఒక ప్రాంతాన రైతులు శిస్తులు సరిగా యివ్వటం లేదని విన్నాను, నిజమేనా ?" అని అడిగాడు.

ఎన్నడూ లేనిది జమీందారీ వ్యవహారాల్లో గోవిందలాలిలా ఆసక్తి కనబరచటం కృష్ణకాంతుడికి చాలా ఆనందం కలిగించింది.

"బందరుఖాలీగ్రామ రైతులు పన్నులు యివ్వటం లేదని నాయక్ చెపుతున్నాడు. తీసుకున్న పన్నులకు అతడు రశీదులు ఇవ్వటం లేదని వాళ్ళంటున్నారు మొత్తం మీద అక్కడి పరిస్థితి అంతా గందరగోళంగా వుంది. నీకు జమీని గురించి ఇప్పటికైనా శ్రద్ధ కలగటం నాకు సంతోషంగావుంది నేను వృద్ధుణ్ణయిపోయాను. ఇంకెంతకాలమని యీ పనులన్నీ చూసుకోగలను ?" అన్నాడు కృష్ణకాంతుడు

"నేను రేపు ఉదయానే బయలుదేరి బందరుఖాలీ వెళతాను." అన్నాడు గోవిందలాలు.

"అలా చేయటం చాలా మంచిది. నీ ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేయిస్తాను," అన్నాడు కృష్ణకాంతుడు.

గోవిందలాలు అక్కణ్ణించి తన గృహానికి వచ్చేశాడు భర్త పదిరోజుల ప్రయాణపు దూరంలో వున్న బందరుఖాలీగ్రామం వెళుతున్నా డని తెలియగానే, భ్రమర తనుకూడా వెంట వస్తానని పట్టుపట్టింది. పడవప్రయాణం సుఖంగా వుండదనీ, తను దారిలో మరికొన్ని గ్రామాలు తిరగవలసి వుంటుందనీ చెప్పి, గోవిందలాలు ఆమె కోర్కెను కాదన్నాడు. భ్రమర కన్నీళ్ళు పెట్టుకుని తన గదిలోకి పోయి, ముసుగుతన్ని పడుకున్నది.

## 7

మర్నాటి తెల్లవారుజామున గోవిందలాలు కొందరు సేవకులను వెంటబెట్టుకుని పడవలో బందరుఖాలీకి ప్రయాణమైపోయాడు అత డటు ఇల్లు వదలగానే భ్రమర యింట్లో పెద్ద గందరగోళం ప్రారంభించింది ఆమె తన గదిలోని వస్తువు లన్నీ చిందరవందర చేసి, జుట్టు పీక్కుని ఏడుస్తూ నేలమీద పడుకున్నది కారణం అడిగ వచ్చిన అత్తగారినీ, ఆడబిడ్డనూ కసిరికొట్టింది వాళ్ళు నిదానంగా సంగ తేమిటో కనుక్కోమని దాసీ క్షీరిని పురమాయించారు

క్షీరికి భ్రమర అంత గొడ వెందుకుచేస్తున్నదో తెలుసు. ఆవిడ భ్రమరపక్క చేరి, "అమ్మా ! ను వ్వెందు కింతగా విచారపడతావ్ ? నీ భర్తకు నిజంగానే మీద ప్రేమ వున్నట్టయితే, నిన్ను వెంట తీసుకుపోకుండా వుండేవాడా ? అతడి

నిన్నుగురించిన విచారం ఏమీలేదు. హాయిగా పడవలో కాలుమీద కాలు వేసుకుని హుక్కా పీలుస్తూ, ఆ రోహిణినిగురించి కలలు కంటూంటాడు,'' అన్నది

క్షీరి యిలా అనగానే భ్రమర దిగ్గున లేచి దాని జుట్టు పట్టుకుని మెడమీదా, వీపు మీదా నాలుగైదు గుద్దులు గుద్దింది. అక్కడికీ కోపం తీరక దాన్ని జుట్టు పట్టుకుని అంతదూరం యీడ్చి, ''ఛీ, పిశాచీ ! నీ యిష్టంవచ్చినట్టు వాగకు. అవతలికి పో," అని తిట్టింది.

క్షీరి కళ్ళనీళ్ళు కళ్ళ కుక్కుకుంటూ బయటికి పోయింది. ఆవిడ తన యజమాను రాలి క్షేమం కోరే రోహిణీ, గోవిందలాలుల ప్రవర్తననుగురించి భ్రమరకు చెప్పా ననుకున్నది. కాని, భ్రమర ఆ మాటలు నమ్మినట్టు కనిపించలేదు

'ఇంత జీవితానుభవం కల నేను, ఒక బాలికచేత నిజం చెప్పి నమ్మించలేక పోయాను,' అనుకుంటూ, ఉతకవలసిన వస్త్రాలు కొన్ని భుజాన వేసుకుని, బిందె చంకన పెట్టుకొని కొలనుకు బయలుదేరింది. దారిలో క్షీరికి హారమణి అనే మరొక పరిచారిక కనిపించింది ఆవిణ్ణి చూస్తూనే క్షీరి స్వగతంలా, "కలికాలం వచ్చి పడింది దొంగలకూ దొరలకూ తేడా లేకుండాపోయింది. గొప్పవాళ్ళ ఇళ్ళల్లో పనిచేయటం చాలా కష్టం,'' అన్నది

ఈ మాటలు శ్రద్ధగా విన్న హారమణి, యిందులో ఏదో గొప్పరహస్యం వున్న దని వూహించి, ''ఏమిటే క్షీరోదా ! ఏం జరిగింది ?" అని ప్రశ్నించింది.

''ఏం జరగటం ఏమిటి, పెద్దపెద్ద ఘోరాలే చీకటి మాటున జరిగిపోతున్నవి. ఇరుగుపొరుగు నిర్భాగ్యులంతా వచ్చి పూలతోటల్లో విహారాలు చేస్తున్నారు. ఈ సంగతులు యజమానులకు చెప్పటం ఎలాగో నాకు తెలియటంలేదు,'' అన్నది క్షీరి.

''ఇరుగుపొరుగు మూక వచ్చి యజమానుల పూలతోటల్లో విహారాలు చేస్తు న్నారా ? ఆశ్చర్యంగా వుందే ! అంత సాహసం చేస్తున్నవా ళ్ళెవరు ?"అని అడిగింది హారమణి.

"ఇంకెవ్వరు ! ఆ పాపిష్టిరోహిణి," అన్నది క్షీరి

హారమణి క్షీరిని రకరకాలుగా ప్రశ్నలు వేసి, ఆమె ద్వారా రోహిణి గోవింద లాలుతో రాత్రిళ్ళు తోటలో తిరుగుతున్నట్టు తెలుసుకున్నది. తరవాత క్షీరి తనకు దారిలో ఏదురైన రాముడితల్లికీ, శ్యాముడితల్లికీ, తారి, హారి, వారి మొదలైన అమ్మలక్క లందరికీ రోహిణి దుష్టస్వభావంగురించి చెప్పేసింది. ఈ విధంగా ఉదయం క్షీరి భ్రమరకు చెప్పిన వార్త, సాయంకాలం అయేటప్పటికి చిలవలూ పలవలూ పెంచుకుని గ్రామమంతా వ్యాపించిపోయింది.



మరుసటిరోజు బారెడు పొద్దెక్కేసరికి వినోదిని అన్న పెద్దింటిఆడబడుచు భ్రమరదగ్గరకు వచ్చి, తాను విన్న వార్తలు చెప్పి, "ఇదేమిటి ? నిజమేనా ?" అని అడిగింది

భ్రమర ఎటూ తేల్చి చెప్పకుండా ఆ మాటా యీ మాటా మాట్లాడి వినోదినిని వదిలించుకున్నది. తరవాత కొంత సేపటికి సురధుని అన్న ఆవిడ వచ్చి, వినోదిని అడిగినట్టే అడిగింది. భ్రమర ఏమీ జవాబు చెప్పలేదు. సురధుని రహస్యం చెప్తు తున్నదానిలా, "నీ వేదో విధంగా చిన్నబాబును వశం చేసుకోవాలి. నీకు మంచి రూపం, గుణం వున్నవి కాని, రోహిణిలా తళుకుబెళుకులూ, టక్కుటెక్కులూ లేవు." అన్నది.

"రోహిణి తళుకుబెళుకుల గురించి మన కెందుకు ?" అన్నది భ్రమర.

"ను వ్వెంత అమాయకురాలివే భ్రమరా ! ఊళ్ళో అందరికీ తెలిసిన సంగతి నీ కింకా తెలియలేదా ? చిన్నబాబు రోహిణికి ఏడువేల రూపాయల విలువ చేసే నగలు చేయించిపెట్టాడట." అన్నది సురధుని

"ఓహో అలాగా ! ఈ మధ్య మా యింటి లెక్కలపుస్తకాలు చూశాను. అందులో నీకు పద్నాలుగువేల రూపాయిలు యిచ్చినట్టు ఖర్చు రాసివున్నది," అన్నది భ్రమర యీసడింపుగా సురధుని మూతి తిప్పి, లేచి వెళ్ళిపోయింది.

ఇవన్నీ విన్న తరవాత భ్రమరకు మతిపోయినంత పనైంది. ఈ అమ్మ లక్కలు చెప్పేదాంట్లో నిజం వున్నదన్న నమ్మకం ఆమెకు కలిగింది. తన భర్త రెండు సంవత్సరాల తరవాత తనకు చెపుతా నన్న రహస్యం, రోహిణితోటి తన సంబంధాన్ని గురించే కావచ్చు, యీ భావం మనసులో మెదలగానే భ్రమర గది తలుపులు బిగించి, నేలపై పడుకుని ఏడుస్తూ అటూ యిటూ దొర్లసాగింది

* * * * * * *

రోహిణికి గ్రామంలో తనమీద ప్రచారం అవుతున్న అపవాదులను గురించి తెలియవచ్చింది. తనమీద యిలాంటి దుష్ప్రచారం చేసినది భ్రమర అని ఆమె నిశ్చయించుకున్నది గోవిందలాలు తనకు ఏడువేల రూపాయిల బంగారునగలు చేయించిపెట్టాడా? క్రోధంతో, అవమానంతో రోహిణి హృదయం భగ్గుమన్నది. లోగడ చోరత్వాపవాదు, యిప్పుడు జారత్వాపవాదు...

తనమీద యిలాంటి నిందలు ప్రచారం చేస్తున్న భ్రమరకు సరైన ప్రతీకారం చేయాలని రోహిణి నిర్ణయించుకుని, తన పొరుగింటి ఆవిడ నడిగి ఒక పట్టుచీరా, కొన్ని గిల్టునగలూ తీసుకున్నది. వాటిని మూటగట్టుకుని సాయంకాలంవేళకు గోవిందలాలు యింటికి వెళ్ళింది. ఆ సమయంలో భ్రమర వరండాలో చాపమీద పడుకునివున్నది రోహిణి రావటం చూస్తూనే ఆమె కొంచెం తత్తరపాటు చెంది, లేచి కూర్చున్నది.

రోహిణి వెళ్ళి ఆమె కెదురుగా నగలమూట పెట్టి మాట్లాడకుండా నిలబడింది. భ్రమర ఆమెకేసి నిప్పులు చెరుగుతూ చూసి, "లోగడ ఒకసారి మా ఇంట్లో దొంగతనం చేశావ్. మళ్ళీ అందుకే వచ్చావా?" అని అడిగింది.

రోహిణి ఆమె ముందు కూర్చుంటూ, "ఇక నాకు దొంగతనాలు చెయ్యవలసిన అవసరంలేదు. నా దారిద్ర్యం తీరిపోయింది, చిన్నబాబుగారి దయవల్ల నాకు కొంత ధనం ముట్టింది. కాని, గ్రామస్తు లనుకుంటున్నంత పెద్ద మొత్తం కాదు," అన్నది.

"ఛీ, నా ఎదట్నించి లేచిపో," అన్నది భ్రమర కోపంగా.

రోహిణి ఆ మాటలేవీ వినిపించుకోకుండా, ''లోకు లనుకుంటున్నట్టు నీ భర్త నా కిచ్చింది, ఏడువేల రూపాయిలుకాదు. మూడువేల రూపాయలూ, నీ పట్టుచీరా మాత్రమే ఇవిగో, వాటిని నీకు చూపించేందుకు తెచ్చాను,'' అంటూ మూట విప్పి, పట్టుచీరా, గిల్టుబంగారపు నగలూ భ్రమరకు చూపింది. భ్రమర వాటిని కాలితో తన్ని చిందరవందర చేసింది.



"అమ్మమ్మా, బంగారాన్ని అలా కాలితో తన్నకూడదు." అంటూ రోహిణి చిందరవంద రైన వస్తువు లన్నిటినీ ఏరి మూటకట్టుకుని, నిశ్శబ్దంగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

భ్రమర తోక తొక్కిన తాచులా లేచి, ఆ క్షణికోద్రేకంలో భర్తకు ఒక వుత్తరం రాసింది. అందులో వున్న తప్పులు, కొట్టివేతలు, అక్షరదోషాలు తొలగిస్తే, ఆ వుత్తరం యిలా వుంటుంది...... "ఆనాటి రాత్రి మీరు తోటలోనుంచి ఆలస్యంగా ఎందుకు వచ్చారో నాకు చెప్పలేదు. రెండేళ్ళ తరవాత చెపుతా మన్నారు. దురదృష్టవశాత్తూ ఆ రెండేళ్ళ కాలం జరక్కుండానే ఆ సంగతి తెలుసుకున్నాను. రోహిణి యింతకుముందే ఆమెకు మీరు బహూకరించిన నగలూ, పటుచీరెలూ తెచ్చి నాకు చూపించింది.

"మీమీద నాకు గల ప్రేమా, భక్తీ అచంచల మైన దని మీకు తెలుసు. కాని మీ ప్రవర్తనద్వారా ... యిప్పుడు ... నా విశ్వాసాన్నీ, ప్రేమనూ కోల్పోయారు. మీరు ఇంటికి తిరిగివచ్చేసంగతి ఒకటి రెండురోజుల ముందుగా నాకు తెలిస్తే, నేను ఏదోవిధంగా మా పుట్టింటికి వెళ్ళిపోతాను."

ఈ వుత్తరం అందగానే, చదువుకుని గోవిందలాలు నిర్విణ్ణు డయాడు. అతడి తలమీద పిడుగు పడినట్టయింది. అదే పోష్టులో అతడికి బ్రహ్మానందుడు రాసిన

మరొక వుత్తరంకూడా వచ్చింది. అందులో బ్రహ్మానందుడు కొంచెం కవిత్వధోరణిలో ... మహారాజులకూ మహారాజులకూ మధ్య జరిగే కుమ్ములాటలో మా బోటి బీదలకు ప్రాణాలు పోతున్నవి. చిన్నరాణి మీ మీద ఎంతైనా అధికారం చెలాయించవచ్చుగాక — మా బోటి బీదలమీద అంతక్రౌర్యం ఎందుకు చూపాలి? నీవు రోహిణికి ఏడు వేల రూపాయిలనగలు చేయించిపెట్టా వని అపవాదు పుట్టించటమే గాక, మమ్మల్ని సాధించేందుకు యింకా ఏమేమో చేయాలని చూస్తున్నట్టు తెలిసింది. నీవు త్వరలో వచ్చి యీ దుర్మార్గాన్ని ఆపాలని కోరుతున్నాను. అట్లా జరగని నాడు మేము గ్రామం వదలి దేశాలు పట్టుకుపోవలసివుంటుంది — అని రాశాడు.

ఈ రెండు వుత్తరాలూ గోవిందలాలుకు ఎంతో మానసిక క్షోభ కలిగించినై. రోహిణిమీద పడిన అపవాదులకు భ్రమరే కారణం అయివుండవచ్చు నన్న అభిప్రాయం అతడికి కలిగింది. ఏది ఏమైనా తను త్వరలో ఇల్లు చేరితేగాని నిజానిజాలు తెలియ వనుకున్నాడు. ఆకారంణగా అతడు మర్నాటి వేకువజామునే పడవ ఎక్కి తిరిగుప్రయాణ మయాడు.

గోవిందలాలు ఇంటికి బయలుదేరినరోజునే, బందరుఖాలీలో జమీందారీ పనులు చూసే నాయక్ కృష్ణకాంతుడికి ఆ విషయం వుత్తరం రాశాడు. తన భర్త తిరిగి వస్తున్నట్టు భ్రమంకు తెలిసింది. అతడు రావటానికి కనీసం నాలుగురోజులు పడుతుంది. ఈ లోపలే తను పుట్టింటికి చేరాలని ఆమె నిశ్చయించుకుని తల్లికి క్షీరిద్వారా ఒక వుత్తరం పంపింది. అందులో తనకు శరీరారోగ్యం ఏమీ బావుండటం లేదనీ, ఆ సంగతి యిక్కడ ఎవరికీ తెలియకుండా దాచి వుంచాననీ తెలియపరచి, "సాధ్యమైతే పల్లకీతో బోయీలను రేపే పంపకోరుతాను. నా ఆరోగ్య విషయం మాత్రం వా శ్శెవరూ యిక్కడ యితరులతో ప్రస్తావించకూడదు." అని రాసింది.

ఈ వుత్తరం చదువుకుని భ్రమర తల్లి తన కుమార్తెకు జబ్బేదో చేసిందని తల్లడిల్లిపోయింది. అప్పుడు వచ్చినకోపంలో అల్లుణ్ణీ, భ్రమర అత్తగార్నీ, బాగా నిందించింది. అప్పటి కప్పుడే భ్రమరకోసం బోయీలను పంపవలసిందని భర్తను తొందర చేసింది.

భ్రమం తండ్రి గొప్ప వ్యవహారజుడు. భ్రమర రాసిన వుత్తరం వెనక ఏదో గూఢరహస్యం వున్నదని అతడు గ్రహించాడు. అయినా ఆ పరిస్థితుల్లో భ్రమరను తెచ్చేందుకు పల్లకీ పంపక తప్పదు. ఆ కారణంవల్ల అతడు కృష్ణకాంతుడికి ఒక వుత్తరం రాసి, బోయీలచేత పంపాడు. అందులో భ్రమరతల్లికి బాగా జబ్బు

చేసిందనీ. కూతుర్ని చూడాలని కలవరిస్తున్నదనీ... ఒక్క నాలుగురోజులు వుండి పోయేందుకు ఆమెను పంపవలసిందనీ రాశాడు. బోయీలకు కూడా అలాగే చెప్ప వలసిందని ఆజ్ఞాపించాడు

కృష్ణకాంతుడు చాలా సేపు చర్చించుకుని. చివరకు కోడలిని పుట్టింటికి పంపేం దుకు నిశ్చయించి, ఆమెను నాలుగురోజుల్లో తిరిగి పంపించవలసిందిగా వియ్యంకు డికి వుత్తరం రాశాడు.

భ్రమర పుట్టింటికి వెళ్ళిపోయిన మూడురోజులకు గోవిందలాలు ఇల్లు చేరాడు. ఆమె పుట్టింటికి వెళ్ళినట్టు తెలియగానే. అతడు అవమానంతో. కోపంతో ఉగ్రు డయ్యాడు. 'ఇంత విశ్వాసహీనురాలు నాకు భార్య ఎలా అవుతుంది? యీ అవమా నాన్ని నేను మరిచిపోను ఇక దానిముఖం చూడను;' అన్న నిర్ణయానికి వచ్చాడు గోవిందలాలు. కృష్ణకాంతుడు భ్రమరను తీసుకువచ్చేందుకు పల్లకీ పంపమన్నాడు. గోవిందలాలు తలవూపి, బోయీలకుమాత్రం వెళ్ళవద్దని ఆజ్ఞ యిచ్చాడు.

అది వర్షాకాలం. ఒకనాటి సూర్యాస్తమయంవేళ గోవిందలాలు తన పూలతోట లోకి వెళ్ళి. అక్కడ ఒక మంటపంమీద కూర్చుని కొలనుకేసి చూస్తున్నాడు. అంతలో ఎవరో ఒకస్త్రీ బిందెతో కొలనుకు వచ్చి మెట్లు దిగుతున్నది. కనుచీకటి కమ్ముకుంటున్నకాలం అవటంవల్ల ఆమె ఎవరో గోవిందలాలు గుర్తించలేదు. కొలను మెట్లు వానకు తడిసి జారుడుగా వున్నవి. ఆ స్త్రీ అది గుర్తించక అజాగ్ర త్తగా నడిచి కాలు జారి కొలనులో పడవచ్చన్న వూహ అతడికి కలిగింది. ఆ వెంటనే అతడు గొంతెత్తి, "ఎవరు వారు? మెట్లు జారుడుగా వున్నవి. జాగ్రత్త!" అని కేక వేశాడు.

గోవిందలాలు చేసిన హెచ్చరిక ఆ స్త్రీ విన్నదో లేదో చెప్పటం కష్టం. ఆమె బిందెను మెట్లమీద పెట్టి. వెనుదిరిగి మెట్లెక్కి తోటకేసి వచ్చింది. తోటద్వారం బార్లా తెరిచివుండటంతో తోటలో ప్రవేశించి, గోవిందలా లున్న మంటపం దగ్గరకు వచ్చింది.

గోవిందలాలు ఆమెను గుర్తించాడు. అతడి గుండెలు గుబగుబలాడినై. శరీరం వేడెక్కింది. మనస్సును మత్తులాటి దేదో ఆవహించింది.

"ఎవరు? రోహిణా! ఈ చీకటివేళ ఎవరైనా నిన్నిక్కడ చూస్తే ఏమనుకుం టారు?" అన్నాడు గోవిందలాలు.

"అనుకోవలసిన దంతా యిప్పటికే అనుకుంటున్నారు. ఇప్పుడు కొత్తగా వా ళ్ళనుకోగలిగిన దేముంటుంది?" అన్నది రోహిణి.

"నీమీద బయలుదేరిన అపవాదుల సంగతి విన్నాను. వాటిని ప్రచారం చేసింది భ్రమర అని నీ అభిప్రాయంలా వున్నది. ఎందు కామెమీద అనవసర అనుమానాలు పెట్టుకుంటావ్ ?" అన్నాడు గోవిందలాలు.

"అదంతా చెపుతాను ఇక్కడ కాదు, మందిరంలోకి వెళదాం పద," అంటూ రోహిణి ఆరామగృహంకేసి నడిచింది. గోవిందలాలు ఆమె వెనగ్గా తలొంచుకుని నడిచాడు.

అక్కడ వాళ్ళిద్దరిమధ్యా నడిచిన సంభాషణాస్వభావం ఎలాంటిదో చెప్పటం కష్టం. కాని, రోహిణి యింటికి తిరిగిపోయేటప్పుడు, గోవిందలాలు తన రూపానికి దాసుడయ్యాడని గ్రహించి తృప్తిగా నవ్వుకున్నది.

## 8

ఒకదుర్ముహూర్తాన గోవిందలాలు పతనం ప్రారంభమై, క్రమంగా దాని వేగం అతిశయించసాగింది రోహిణి మోహంలో పడి అతడు భ్రమరను సాంతం మరిచాడు కృష్ణకాంతునికి క్రమక్రమంగా రోహిణీ గోవిందలాలుల దుష్టప్రణయాన్ని గురించిన వార్తలు తెలియవచ్చినై అతడు తన తమ్ముడి కొడుకును మందలించా లనుకున్నాడు. కాని, ఆ సమయంలో అతడు రోగగ్రస్తుడై మంచంపట్టివున్నాడు. గోవిందలాలు ప్రతిదినం ఆయనను చూడవచ్చేవాడు కాని, ఆ సమయంలో గదిలో సేవకులో, వరిచారికలో వుండటంతో కృష్ణకాంతుడు ఏమనేందుకూ వీలుకాక వూరుకునేవాడు.

ఒకరోజున గోవిందలాలు బాగా పొద్దుపోయి పెదతండ్రిగదికి వెళ్లాడు. కృష్ణకాంతుడు అతణ్ణి చూస్తూనే, "ఇంత ఆలశ్యంగా వచ్చావేం?" అని అడిగాడు. గోవిందలాలు ఆ ప్రశ్నకు జవాబు చెప్పక, "ఇవ్వాళ మీ కెలావుంది?" అంటూ అతడి నాడి పరీక్షించాడు నాడి మందగిస్తున్నట్టు తెలిసి, గోవిందలాలుకు తత్తరపాటు కలిగింది. అతడు వెంటనే వైద్యుడిదగ్గరకు పోయి, సంగతి చెప్పి, వెంటపెట్టుకు వచ్చాడు వైద్యుడు హడావిడిగా మందులపెట్టెతో రావటం చూసి కృష్ణకాంతుడి ముఖం వెలవెలబోయింది.

"పరిస్థితి విషమించేలా వున్నదా ఏం?" అని ప్రశ్నించాడు కృష్ణకాంతుడు వైద్యుణ్ణి.

"మనుష్యశరీరానికి ఏక్షణాన ఏంజరుగుతుందో ఎవరు చెప్పగలరు?" అంటూ వైద్యుడు ఔషధం తయారు చేయసాగాడు

"ఇంకా వున్న వ్యవధి ఎంత?" అని ప్రశ్నించాడు కృష్ణకాంతుడు.



వైద్యుడు తాను తయారు చేసిన ఔషధాన్ని గ్లాసులో పోసి కృష్ణకాంతుడి కందిస్తూ "ముందు యీ ఔషధం త్రాగండి. తరవాత చెపుతాను." అన్నాడు.

కృష్ణకాంతుడు పరిస్థితిఅంతా అర్థంచేసుకున్నవాడిలా తల వూపి, చిరునవ్వు నవ్వుతూ, ఔషధాన్ని ఓమారు కళ్ళ కద్దుకుని దూరంగా పారపోస్తూ, ''మందులతో వ్యాధి నయమయే వయసు గడిచిపోయింది. ఇప్పుడు హరినామస్మరణే నాకు దిక్కు. మీరంతా ఆ నామస్మరణ చేయండి. నే వింటాను," అన్నాడు.

కృష్ణకాంతుడి మాటలు విని అందరూ నిశ్చేష్టు లయారు. కృష్ణకాంతుడు కొంచెం సేపు హరినామస్మరణ చేసి, గోవిందలాలుతో. ''నా తలదిండుకింద వున్న తాళపు చెవులు తియ్యి." అన్నాడు. గోవిందలాలు అలాగే చేశాడు.

"బీరువా తెరచి అందులో వున్న నా వీలునామా తీసుకురా." అన్నాడు కృష్ణకాంతుడు. గోవిందలాలు వీలునామా తేగానే, "నాయక్‌నూ, గ్రామంలో వున్న పెద్దలనూ తక్షణం పిలిపించు." అని చెప్పాడు.

క్షణాలమీద నాయక్‌తోపాటు గ్రామంలోని ముఖ్యోపాధ్యాయులూ, చటోపాధ్యాయులూ, ఘోషులూ, మిత్రులూ, వసులూ, దత్తులూ-అంతా కృష్ణకాంతు డున్న గదికి వచ్చారు అప్పుడు కృష్ణకాంకుడు నాయక్‌తో "వీలునామా అందరూ వినేలా చదివి వినిపించు,'' అన్నాడు

నాయక్ చ వాడు. అప్పుడు కృష్ణకాంతుడు నాయక్‌తో, "ఆ వీలునామా చించివేసి మరొక వీలునామా రాయి. అన్నాడు.

"ఎలా రాయమన్నారు?" అని అడుగాడు నాయక్.

"అంతా ఆ వీలునామాలాగే రాసి, అందులో వున్న గోవిందలాలు పేరుకు బదులుగా నా తమ్ముడి కోడలైన భ్రమర పేరురాసి, ఆమెకు ఆస్తిలో చెందే అర్ధ భాగం, ఆమె అనంతరం గోవిందలాలుకు చెందేలాగా రాయి.'' అన్నాడు కృష్ణ కాంతుడు.

ఇది విని అందరూ విస్మయు లయారు. నాయక్ గోవిందలాలుకేసి చూశాడు. గోవిందలాలు తన పెదనాన్న చెప్పిన విధంగానే వీలునామా రాయమన్నట్టు సౌజ్ఞ చేశాడు నాయక్ వీలునామా రాసి, కృష్ణకాంతుడికి చదివి వినిపించి, ఆయన చేతి కిచ్చాడు. కృష్ణకాంతుడు చేవ్రాలు చేశాడు. ఆ తరవాత అక్కడున్నవారిలో కొందరు సాక్షి సంతకాలు చేశారు. గోవిందలాలుకూడా ఆ వీలునామాకు తన అంగీకారం సూచిస్తూ సంతకం చేశాడు.

ఆ రాత్రి మూడవజామున కృష్ణకాంతుడు తులసితావళముతో హరినామస్మరణ చేస్తూ, నిర్విచారంగా దివంగతు డయాడు.

ఈ వార్త విని భ్రమర పుట్టింటినుంచి తిరిగి వచ్చింది. దుఃఖ నిమగ్నుడై వున్న భర్త గోవిందలాలును చూసి, ఆమె పెద్దగా ఏడ్చింది. భార్యాభర్త లిద్దరూ తమ తగవులను గురించి కీచులాడుకునేందుకూ, వాదోపవాదాలు చేసుకునేందుకూ అవకాశం కలగలేదు. తమ యిద్దరిమధ్యా మునుపటి ప్రేమ లేదని యిద్దరూ గ్రహించారు. ఆ కారణంవల్ల ఆ విషయ ప్రసక్తేమీ లేకుండా కేవలం కృష్ణ కాంతుని అంత్యక్రియలు ఏర్పాట్లను గురించిమాత్రం అవసరం అయినప్పుడు ఒకటి రెండు మాటలు ముక్తసరిగా మాట్లాడుకుని. ఎవరి పనులమీద వారు వెళ్ళిపో సాగారు.

కృష్ణకాంతుని శ్రాద్ధక్రియలు జరిపేందుకు హరలాలు వచ్చాడు. అతడికి తన తండ్రి రాసిన వీలునామా సంగతి తెలిసింది. దానికి సరిఅయిన సాక్ష్యాధారాలూ అవీ వుండటంతో, తను తగవుపెట్టి లాభం లేదని అతడు గ్రహించాడు. ఆకారణం వల్ల హరలాలు ఎటువంటి గొడవలూ లేవనెత్తకుండా తండ్రి అంత్యక్రియలు సక్ర మంగా నెరవేర్చి తనదారిన తాను వెళ్ళిపోయాడు.

కృష్ణకాంతుడి వీలునామాను అతడి బంధువులఎదట నాయక్ చదివి వినిపించాడు. ఆ సమయంలో రమ్మని కబురు వచ్చినా భ్రమర అది వినేందుకు వెళ్ళలేదు.

గోవిందలాలు ఆమె దగ్గరకు వచ్చి, "వీలునామా సంగతి విన్నావా?" అని ప్రశ్నించాడు.

"వినలేదు అయినా, నే వినవలసిన అవసరం ఏమున్నది?" అన్నది భ్రమర.

"ఆస్తిలో సగం నీది," అన్నాడు గోవిందలాలు.

"నాది మీది అన్న భేదం ఎక్కడున్నది? అంతా మీదే," అన్నది భ్రమర.

"పరిస్థితులు మారినై ఆ కారణంవల్ల ఆ అర్ధభాగం ఆస్తి నీదే"

"పరిస్థితు లేమీ మారలేదు. ఆస్తి మీదే."

"కాదు. నీ ఆస్తి నే ననుభవించాను," అన్నాడు గోవిందలాలు కటువుగా.

భ్రమర ముంచుకువచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ, "అయితే, యిప్పుడు మీ రేం చెయ్యబోతున్నారు?" అని అడిగింది.

"నే నిప్పుడు నిర్ధనుణ్ణి బతుకుతెరువుకు ఏదో ఒక ఉద్యోగంకోసం ప్రయత్నిం చాలి," అన్నాడు గోవిందలాలు.

"ఈ ఆస్తి మా పెద్దమామగారిది. ఆయన వారసులు మీరు కాని, నేను కాదు. మా మామగారి ఆస్తిని తన యిష్టం వచ్చినవారికి రాసియిచ్చే అధికారం మా పెద మామగారికి లేదు. ఈ సంగతి మానాన్న చెప్పాడు," అన్నది భ్రమర.

"మా పెదతండ్రి అమాయకు డేంకాదు. ఆయన ఆస్తి నీకు చెందేటట్టు రాశాడు ఆ కారణంవల్ల ఆస్తి నీది, నాదికాదు," అన్నాడు గోవిందలాలు రోషంగా.

"అయితే, నే నిప్పుడు ఆ ఆస్తిఅంతా మీ పేర రాస్తాను," అన్నది భ్రమర

"నీ విచ్చే దానంమీద బతకటంకన్న చావటం మేలు," అన్నాడు గోవిందలాలు.

"ఇంతకూ నేను చేసిన నేరం ఏమిటి? మీకు చెప్పకుండా పుట్టింటికి పోవటమే గదా, నా నేరం! నన్ను క్షమించండి. నాకు జీవితంలో మీరుతప్ప మరెవరూ లేరు. ఆ కారణంవల్ల నే కోపగించుకుని పుట్టింటికి వెళ్ళాను. నేను నూరుతప్పులు చేసి వుండినా, నన్ను క్షమించి మీ దాసిగా స్వీకరించండి," అంటూ భ్రమర గోవింద లాలు పాదాలమీద పడి, సంతతధారగా కన్నీళ్ళు కార్చసాగింది.

గోవిందలాలు భార్యకేసి నిశితంగా చూశాడు ఆమె చెదిరిన జుట్టూ, వెక్కి వెక్కి ఏడ్చేగొంతూ, కన్నీళ్ళూ — యివేవీ అతడిలో జాలి కలిగించలేదు. అతడు మాట్లాడకుండా వూరుకున్నాడు. అతడి హృదయం ధర్మపత్ని దుఃఖాన్ని కాతరు చేసే స్థితిలోలేదు అతడు రోహిణి రూపలావణ్యాలగురించి ఆలోచిస్తున్నాడు. ఈ భ్రమర గుణవతి; రోహిణి రూపవతి, ఇంతకాలంగా గుణాన్ని ప్రేమించాను, ఇక కొంతకాలం రూపాన్ని ప్రేమిస్తాను. ఆశాశూన్యంగా, నిస్సారంగా వున్న యీ జీవి

తాన్ని యథేచ్ఛగా కొన్నాళ్ళు గడిపి. కాలం సమీపించినప్పుడు హాయిగా మట్టిలో కలిసిపోతాను...'

''ఏ మంటారు ? నన్ను క్షమించరా ?'' అన్నది భ్రమర, గోవిందలాలు పాదాలను రెండుచేతులతో మరింతగా పొదివి పట్టుకుంటూ.

"నిన్ను వదిలేస్తున్నాను" అన్నాడు గోవిందలాలు.

భ్రమర మారు మాటాడకుండా అతడిపాదాలు వదిలి లేచి, ద్వారంకేసి నాలు గడుగులు నడిచి, శరీరాన్ని మైకం ఆవహించగా మూర్ఛవచ్చి కిందపడిపోయింది

* * * * * * *

తన కొడుకూ, కోడళ్ళు అన్యోన్యంగా వుండటం లేదని గోవిందలాలు తల్లి తెలుసుకున్నది. ఆమె అంత తెలివిగలదికాదు. లేకపోతే, వారిద్దరి మధ్యా వున్న కలహకారణం ఏమిటో కనుక్కొని, సఖ్యత కుదిర్చేందుకు ప్రయత్నించివుండేది

కృష్ణకాంతుడు తన ఆస్తిలో సగపాలు కోడలిపేర రాసిపోయాడని తెలిసి ఆమెకు చాలాకోపం కలిగింది ''ఈ నాటినుంచీ నేనూ, నా కుమారుడు కోడలి దయాధర్మబిచ్చాలమీద బతకవలసిన దురవస్థ పట్టింది," అనుకున్నదామె గోవిందలాలు దుర్నడతలు తెలుసుకునే, కృష్ణకాంతుడు అలాంటి వీలునామా రాశాడని ఆమె వూహించలేకపోయింది. ''కుమారుడుండగా, కోడలికి ఆస్తిపై సర్వాధికార మేమిటి ?" అన్నదే ఆమెను బాధించిన ప్రశ్న.

ఆమెకు చాలా కాలంగా కాశీకి పోవాలన్న కోర్కె వున్నది. పుత్రుడి గృహ జీవితం అస్తవ్యస్తం అయిపోతున్నదని గ్రహించగానే, యిక తానిక్కడ వుండి చేయగలిగిందేమీ లేదనీ, కాశీ వెళ్ళి శేషజీవితాన్ని అక్కడ గడపటమే మంచిదనీ నిర్ణయించుకున్నది.

"గోవిందూ, పెద్దవాళ్ళొకళ్ళొకళ్ళే కాలధర్మం చెందుతున్నారు. ఇక నా నెక్కడ చోటు లేదు. కాశీకిపోయి, అక్కడే ప్రాణాలు విడవాలని వున్నది. నన్ను కాశీకి తీసుకుపోయి దిగబెట్టి రాగలవా ? తల్లిగా యిదే నా ఆఖరి కోర్కె," అన్నదామె ఒక రోజున.

గోవిందలాలు తల్లికెలాంటి అభ్యంతరమూ చెప్పక, ''అలాగే చేస్తానమ్మా. తప్పకుండా నిన్ను కాశీకి తీసుకుపోతాను," అన్నాడు.

దురదృష్టవశాత్తు యీ సమయంలో భ్రమర పుట్టింటిదగ్గిర వున్నది. గోవింద లాలు తల్లి ప్రయాణాన్ని గురించి ఆమె కేమీ తెలియబరచకుండానే, అవసరం అయిన ఏర్పాట్లు చేయసాగాడు. అతడికి వ్యక్తిగతంగా తండ్రినుంచి సంక్రమిం

చిన కొన్ని విలువైన వజ్రాలూ, కెంపులూ వున్నవి వాటి నతడు అయినకాడికి తెగనమ్మి ఒక లక్ష రూపాయిలు పోగుచేశాడు ఆ ధనంతో తన భవిష్యత్తులో ఎలాగో ఒకలాగు కాలక్షేపం చేయాలని అతడి ప్రయత్నం.

తల్లి కాశీకి బయలుదేరేరోజు నిర్ణయం కాగానే గోవిందలాలు భ్రమరకు కబురు చేశాడు ఆమె వచ్చి ఏర్పాట్లన్నీ చూసి అత్తగారి దగ్గరకు వెళ్ళి ఆమె పాదాలపై బడి, "ఇంట్లోవున్న ఒక్క పెద్దవారూ మీరు కాశీ వెళ్ళిపోతే, గృహ వ్యవహారాలు చూసేవా రెవరు? నేను చిన్నదాన్ని, అనుభవం లేనిదాన్ని. తమరు కరుణించి యీ ప్రయాణం మానుకోండి," అని కళ్ళనీళ్ళతో ప్రార్థించింది

అత్తగారి హృదయం కరగలేదు ఆమె రుసురుసులాడుతూ, "నేను లేకపోతే నేం? మీ పెద్ద ఆడబిడ్డ యింట్లోనే వుంటుంది. పైగా, ఇప్పుడు నీవేగదా ఇంటి కంతా యజమానురాలివి!" అనేసింది

భ్రమర తా నిప్పు డొక మహావిపత్సముద్రంలో పడిపోతున్నట్లు గ్రహించింది. ఆమె గోవిందలాలుదగ్గరకు పోయి, కన్నీళ్ళు కార్చుతూ పాదము లంటి, "కాశీ నుంచి ఎప్పుడు తిరిగివస్తారు?" అని అడిగింది

"మళ్ళీ యిక్కడికి రావాలని నాకులేదు," అన్నాడు గోవిందలాలు. తనకు విషం తాగి మరణించటంతప్ప మరోమార్గం లేదనుకుంటూ భ్రమర తన గదికి వెళ్ళిపోయింది.

మర్నాటి ఉదయం ప్రయాణానికంతా సిద్ధం చేసి, రైలుస్టేషనుకు పోయేందుకు తల్లిని పల్లకీలో ఎక్కించి, గోవిందలాలు తాము బయలుదేరిపోతున్నట్లు భ్రమరకు చెప్పేందుకు ఆమె గదిలోకి వెళ్ళి, "భ్రమరా! మా అమ్మను కాశీలో దిగబెట్టేందుకు వెళుతున్నాను," అన్నాడు.

"అత్తగారు అక్కడే వుండిపోతారు. మీరైనా తిరిగివస్తారా?" అని అడిగింది భ్రమర గోవిందలాలు భార్యముఖంకేసి చూసి నివ్వెరపోయాడు. ఆ ముఖంలో యిప్పుడు విచారఛాయ లేమీ లేవు కంఠస్వరంలో గాంభీరత వ్యక్తపడింది. వెంటనే జవా బివ్వలేక గోవిందలాలు మౌనం వహించాడు.

"సత్యం పలకటంకన్న ధర్మం మరేదీ లేదని, మీరు నాతో అంటూండేవాళ్ళు. నేను మీ ధర్మపత్నిని. ఇప్పుడు నిజం చెప్పండి, మీరు ఎప్పుడు తిరిగివస్తారు?" అని ప్రశ్నించింది భ్రమర.

"నిజం చెప్పమంటావా? అయితే విను; నేను తిరిగిరాను," అన్నాడు గోవిందలాలు

"నా నేరం ఏమిటో స్పష్టంగా చెప్పండి. నేనెన్నటికీ మీ దాసానుదాసిని." అన్నది భ్రమర.

"అది అబద్ధం భ్రమర నా దాసానుదాసి అయివుంటే, నేను గ్రామాంతరం వెళ్ళి తిరిగి వస్తున్నానని వార్త తెలియగానే పుట్టింటికి వెళ్ళిపోదు." అన్నాడు గోవిందలాలు.

"ఆ అపరాధాన్ని క్షమించమని, మీ కాళ్ళు పట్టుకుని వేడుతున్నాను. నా ఒక్క అపరాధాన్నికూడా మీరు క్షమించలేరా?"

"అది ఒక్క అపరాధమే కావచ్చు. కాని, నీవిప్పుడీ గృహానికి సర్వాధికారిణివి. మరెన్ని అపరాధాలు చేసినా నేను చేయగలిగిందేముంటుంది?"

"ఈ గృహానికి నేనా అధికారిణిని? అయితే, యీసారి పుట్టింటికి వెళ్ళి ఏం తెచ్చానో చూడండి." అంటూ భ్రమర పెట్టెలోనుంచి ఒకకాయితం తీసి చదవమని భర్తకిచ్చింది. గోవిందలాలు కాయితం చదివాడు. అది భ్రమర తన పేర నున్న ఆస్తి యావత్తూ గోవిందలాలు పేర రాసి రిజిష్టరు చేయించిన పత్రం.

"నీకు మంచి దని తోచిన విధంగా నీవు చేశావు. కాని, నీకు నాకూ ఎలాంటి పొత్తూలేదు. నీ విచ్చే దానాన్ని స్వీకరించి బతకవలసిన దురవస్థ నాకు పట్టలేదు." అంటూ గోవిందలాలు ఆ పత్రాన్ని ముక్కలు ముక్కలుగా చించివేశాడు.

"దాన్ని చించినా పరవాలేదు. దీని నకలుప్రతి ఒకటి సర్కారు ఆఫీసులో వుంటుందని మా నాన్న చెప్పారు," అన్నది భ్రమర.

"ఉండనియ్. ఇక నేను పోతున్నాను." అంటూ గోవిందలాలు కదిలాడు.

"ఎప్పుడు వస్తారు?"

"ఇక రాను."

భ్రమర చీరచెరగుతో కన్నీళ్ళు తుడుచుకుని, చేతులు మోడ్చి, "అయితే, యిక బయలుదేరండి. సాధ్యమైనంత వరకు వుండేందుకే ప్రయత్నించండి. నిరపరాధినైన నన్ను, పరిత్యజించా లనుకున్నారు, పరిత్యజించండి. గుర్తుంచుకోండి! పైన దేవుడున్నాడు. ఎప్పటికైనా మీరు నన్ను తలుచుకుని దుఃఖించే రోజు రాకపోదు. నేనే నిజమైన సాధ్వి నైతే, మనోవాక్కాయకర్మల మీ చరణములపై భక్తి గల దాననైతే, నాకు తప్పక మీ పునర్దర్శనం లభించకపోదు. నేను తిరిగి రానని మీరు మరొకసారి చెప్పవచ్చు కాని, మిమ్ములను మరొకసారి చూడగలనని నేను దృఢంగా నమ్ముతున్నాను. మీరు 'భ్రమరా!' అని నన్ను తప్పక పిలవటమేకాదు, నాకోసం దుఃఖిస్తారు. ఈ నా మాటలే వమ్మయితే, దేవుడు మిథ్య, ధర్మం మిథ్య,



భ్రమర కళంకిని అని నమ్మండి. మీరు వెళ్ళిపోతున్నా రని నాకు విచారంలేదు – మీ రెప్పటికీ నావారే – రోహిణివారు కాలేరు," అని చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

## 9

గోవిందలాలు క్షేమంగా తల్లితో కాశీ చేరినట్టు ఇంటికి ఉత్తరాలు వచ్చినై. వాటి నతడు దివానుకూ, నాయక్‌కూ రాశాడు. ఆ సంగతి తెలిసి భ్రమర వుత్తరం

రాద్దా మనుకుని. స్వాభిమానంవల్ల రాయకుండా వూరుకున్నది. రెండునెలలు గడిచి పోయినై. గోవిందలాలు కాశీనుంచి బయలుదేరి యింటికి వస్తున్నట్టు వుత్తరాలు వచ్చినై. తల్లిని తృప్తిపరిచేందుకు తా నింటికి వెళుతున్నట్టు ఆమెతో చెప్పి. వుత్తరాలు రాశాడేగాని. నిజంగా తనభర్త ఇంటికి రాడని భ్రమర ఊహించింది.

భర్త కాశీ వెళ్ళినప్పటినుంచీ భ్రమర రోహిణినిగురించి సమాచారం తెలుసు కుంటూనేవున్నది. రోహిణి జీవితంలో మార్పేమీలేదు ఆమె మామూలుగానే కొలనుకు వెళ్ళుతున్నది. ఇంత వండి తాను తిని. పినతండ్రికి పెడుతున్నది.

ఉన్నట్టుండి ఒకరోజున రోహిణికి బాగా జబ్బు చేసినట్టు భ్రమరకు తెలియ వచ్చింది. బ్రహ్మానందుడే ఇంటిపనులన్నీ చేసుకుంటున్నాడట. ఇలా ఒకనెల గడవ గానే ఆమెకు కొంచెం స్వాస్థ్యం చిక్కినట్టూ. మొక్కుతీర్చుకునేందుకు తారకేశ్వర క్షేత్రం పోనున్నట్టూ భ్రమరకు తెలిసింది. ఆ తరవాత నాలుగైదురోజులకే రోహిణి ఒంటరిగా ప్రయాణమై తారకేశ్వరం పోయినట్టు అందరూ చెప్పుకోసాగారు.

గోవిందలాలు కాశీకి వెళ్ళి ఆరునెల లైపోయింది. అతడింటికి తిరిగిరాలేదు. కాశీ లోనూ లేడు. భ్రమర చాలా దిగులుపడి తన ఆడబిడ్డద్వారా అత్తగారికి వుత్తరం రాయించింది. కొద్దిరోజులకు ఆమెనుంచి జవాబు వచ్చింది. గోవిందలాయి తనకు వుత్తరాలు రాస్తూనే వున్నట్టూ. అతడు ప్రయాగ, మధుర, జయపురం వగైరా క్షేత్రాలు తిరుగుతున్నట్టూ ప్రస్తుతం ఢిల్లీలో వున్నట్టూ — కాని, ఏ ఒకచోటూ నిలకడగా వుండక దేశసంచారం చేస్తున్నట్టూ — ఆమె జవాబు రాసింది.

రోహిణి నెలరోజులుగడిచినా ఇంటికి తిరిగిరాలేదు. భ్రమరకు అనుమానాలు ఎక్కువకాసాగినై. ఆమె ఎక్కడున్నది? అన్న ప్రశ్న భ్రమరను వేదించసాగింది. ఆమె కొన్నాళ్లు పుట్టింటిదగ్గర వుండేందుకు వెళ్ళి. నెల తిరగకుండానే ఇంటికి తిరిగి వచ్చి. భర్త సమాచారంకోసం ఆడబిడ్డచేత కాశీకి ఉత్తరం రాయించింది. అత్తగారు గోవిందలాలు తనకు ఉత్తరాలు రాయటం లేదనీ. ఎక్కడున్నదీ తెలియదనీ జవాబు రాసింది.

ఈ విధంగా మొదటి సంవత్సరం గడిచిపోయింది. ఆ సంవత్సరం వర్షాకాలాంత సమయంలో భ్రమర వ్యాధితో మంచం పట్టింది. ఈ వార్త విని ఆమె తండ్రి మాధవీనాధసర్కారు కూతురును చూచేందుకు హరిద్రాగ్రామం వచ్చాడు. ఆయన చూడటానికి పెద్దమనిషిలా కనిపిస్తాడు. నలభై ఒకటిరెండు కన్న వయ సుండదు. అతడి ప్రవర్తనను గురించి రకరకాల అభిప్రాయము లున్నవి కొందరతణ్ణి చాలా




పెద్దమనిషంటారు; మరికొందరు అతడికన్న దుష్టుడు లేడంటారు. కాని, ప్రతి ఒక్కరూ అత డెంతో చతురుడనీ, వ్యవహారజ్ఞుడనీ ఒప్పుకుంటారు.

కుమార్తె దురవస్థ చూసి మాధవీనాథసర్కారు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఆమె కింకా పదిహేడేళ్ళయినా గడవలేదు. అప్పుడే సంసారజీవితం భగ్నమై పోయింది. ఎండి శల్యమైపోయిన ఆమె మరెంతోకాలం బతుకుతుందన్న ఆశ కూడా సర్కారుకు కలగలేదు.

భ్రమర తండ్రిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుని, "నాన్నా! ఇక ఎంతోకాలం బతుకుతా నని నాకు ఆశలేదు. నాచేత దానధర్మాలూ, చేయవలసిన వ్రతాలూ చేయించు. నాకు ధనాశ కేమీ లోటులేదు," అన్నది.

సర్కారు ఆ మాటలు విని దుఃఖం ఆపుకోలేక గదినుంచి బయటికి పోయి కుమిలి కుమిలి ఏడ్చాడు. కొంత సేపటికి ఆదుఃఖం భయంకర క్రోధంగా మారింది. "నాకూతురు దుస్థితికి కారకులైనవారిని తప్పక దండించితీరుతాను వారిని సర్వనాశనం చేయకుండా వదలను." అని ప్రతిజ్ఞ చేశాడు.

తరవాత అతడు కూతురుదగ్గిరకు పోయి, "అమ్మా! వ్రతాలు చేసేందుకు యిది సమయంకాదు. ఉపవాసాలూ అవీ చెయ్యలేవు. తిరిగి ఆరోగ్యం కోలుకున్నాక ఆ విషయిం ఆలోచిద్దాం." అన్నాడు.

"నేను తిరిగి ఆరోగ్యవంతురాలిని కావటమా?" అన్నది భ్రమర నిస్పృహగా.

"అదేమంత కష్టంకాదు. నీకిక్కడ సరిగా సేవ చేసేవాళ్ళుగానీ, వైద్యం చేసే వాళ్ళుగానీ ఎవరూలేరు. నిన్ను మనఊరు తీసుకుపోతాను. అక్కడ త్వరలోనే నీవు ఆరోగ్యవంతురాలి వవుతావు." అని కూతురుతో చెప్పి సర్కారు సరాసరి దివానుదగ్గిరకు పోయి, "గోవిందలాలు దగ్గిరనుంచి వుత్తరాలు వస్తున్నవా?" అని అడిగాడు.

"ఈ మధ్య చాలాకాలంగా వుత్తరాలు లేవు. కాశీలో వున్న రాణిగారి దగ్గిరకు సమాచారం తెలుసుకు వచ్చేందుకు సేవకు ణ్నొకణ్ణి పంపాం. ఆమెగారికక్కడా ఏమీ తెలియదు. చిన్నబాబుగారు అజ్ఞాతవాసంలో వున్నట్టు నా కనుమానం కలుగుతున్నది." అన్నాడు దివాను.

మాధవీనాధ సర్కారుకు యిలాంటి అనుమానం ఎన్నడో కలిగింది. అజ్ఞాత వాసంలో వున్నది ఒకడుకాదు; ఇద్దరు. గోవిందలాలు, రోహిణి. ఇలా అనుకుంటూ అతడు సరాసరి గ్రామంమధ్య వున్న పోస్టాఫీసుకు పోయాడు.

అక్కడ విచారించగా, బ్రహ్మానందుడికి నెలనెలా డబ్బూ, వుత్తరాలూ వస్తున్నట్టు అతడికి తెలిసింది. వుత్తరాలు రిజష్టరుపోష్టులో వస్తున్నవి అవి పోష్టు చేయబడుతున్నచోటు ప్రసాదపురం. అది జెస్సూరు జిల్లాలో దని పోష్టుమాష్టరు చెప్పాడు.

ఆ తరవాత బ్రహ్మానందుణ్ణి బెదిరించి గోవిందలాలు రోహిణి ఎక్కడ ఉన్నదీ ఆ గుట్టుమట్లన్నీ తెలుసుకున్నాడు.

మాధవీసర్కారు తనకు కలకత్తాలో అవసరమయినపని వున్నదనీ, వెళ్ళి ఒక పదీ పన్నెండు రోజుల్లో తిరిగివస్తాననీ భ్రమరకు చెప్పి కలకత్తా ప్రయాణమై వెళ్ళాడు. ఆ నగరంలో అతడికి నిశాకరు డనే స్నేహితు డొక డున్నాడు. ఇతడు వయసులో సర్కారుకన్న పదీ పదకొండేళ్ళు చిన్న. పిత్రార్జితం చాలావుండటంతో ఏపనీ చేయక, సంగీతం నేర్చుకునే నెపంమీద అక్కడికీ ఇక్కడికీ తిరుగుతూండే



వాడు సర్కారు అతణ్ణి కలుసుకుని. "నిశాకరా! ప్రస్తుతం ఏంచేస్తున్నావు? చిన్న యాత్ర చేసివద్దాం రాగలవా?" అని అడిగాడు.

"ఏ ప్రాంతానికి పోవాలి?" అనడిగాడు నిశాకరుడు.

"జెస్సూరు మండలానికి "

''అక్కడ యాత్రాస్థలా లేవీ లేవే.''

"అలాంటి వేమీ లేకపోతే, నీలిమందు వ్యాపారం చేద్దాం," అన్నాడు సర్కారు

నిశాకరుడు ఇందులో ఏదో రహస్యం వున్నదనుకుని నవ్వి. ''సరే, అలాగే వెళదాం." అన్నాడు. ఆ మరసటి రోజునే ఆ ఇద్దరూ ప్రయాణమై జెస్సూరు మండలంలోని ప్రసాదవురంకేసి వెళ్ళారు

## *10*

ప్రసాదపురం చిత్రానదికి నాలుగైదు ఫర్లాంగుల దూరంలో వున్న ఒక చిన్న గ్రామం ఒకప్పు డా ప్రాంతం నీలిమందుతోటలకు ప్రసిద్ధి కెక్కినది. కాని, ఇరవై ముప్పై ఏండ్లుగా ఆ ప్రాంతాన ఆ తోటల పెంపకం ఆగిపోయింది నీలిమందు వ్యాపారం గిట్టుబాటు కాకపోవటంతో, చిత్రానది ఒడ్డున రెండంతస్తుల మేడ కట్టుకుని ఆ చుట్టుప్రక్కల వున్న పొలాలన్నీ గుత్తకు తీసుకుని నీలిమందు పండించిన తెల్ల దొర, ఆ మేడ ఒక బెంగాళీవాడికి అమ్మి కలకత్తాకు వెళ్లిపోయాడు ఆ బెంగాళీ

వాడు ఆ మేడలో కొద్ది సంవత్సరాలు నివశించి. అక్కడి ఒంటరి జీవితంతో విసిగి. మేడను ప్రసాదపురంలోని ఒక ధనిక రైతుకు కొద్దివెలకు అమ్మి తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఈ మధ్య ఆ మేడ మరొకరికి దఖలు పడింది.

నిశాకరుడు ఒక సాయంకాలంవేళ మేడకు ఫర్లాంగు దూరంలోవున్న నదీ సోపానా లెక్కి ఆ మేడ ముందుకు వచ్చాడు. అక్కడ గేటుదగ్గిర ఆ మేడలో ప్రస్తుతం వుంటున్న యజమాని సేవకులు బహిరంగడు, గోపనుడు అనేవారు అతడికి కనిపించారు

నిశాకరుడు వారిని సమీపించి, "మీ యజమాని ఇంట్లో వున్నారా? వారితో కొంచెం పనివుంది." అన్నాడు.

"ఇంట్లోనే వున్నారు. కాని, వారు ఎవరినీ చూడరు. అయినా, మీ పే రేమిటి?" అని అడిగాడు బహిరంగడు.

''నా పేరుతో పనిలేదు ఒక పెద్దమనిషి చూచేందుకు వాచ్చా డని చెప్పండి. చాలు" అంటూ నిశాకరుడు జేబులోంచి రూపాయిలు తీశాడు. ఆ రూపాయి చూస్తూనే బహిరంగుడు దేగలా రివ్వున వచ్చి దాన్ని లాక్కుని. యజమానితో నిశాకరుణ్ణి గురించి చెప్పేందుకు మేడమీదికి పరిగెత్తాడు. నిశాకరుడు అక్కడ తెల్లముఖం వేసుకుని నిలబడివున్న గోపనుడికి ఒక రూపాయి యిస్తూ, "మేడ చుట్టూ చాలా అందమైన ఉద్యానవనం వున్నట్టున్నది. కాస్త ఆ పూలచెట్లూ అవీ చూసివస్తాను. నీ తోటివాడు తిరిగి రాగానే, ఆ సంగతి నా దగ్గిరకు వచ్చి చెప్పు.'' అంటూ ఉద్యాన వనంలోకి వెళ్ళాడు

నిశాకరుడు వనంలో కాసేపు అటూ యిటూ తిరిగి తల ఎత్తి పైకి చూశాడు. అతడికి పై అంతస్తు కిటికీలోంచి తనకేసే చూస్తున్న ఒక సుందరి కనిపించింది. ఆమె ముఖసౌందర్యానికి నిశాకరుడు అబ్బురపడ్డాడు ఆమెకూడా అతడి అందచందా లకు పరవశురా లవుతూ, "ఎవ రితను ? ఈ ప్రాంతాలవాడులా లేడు. ఎంత అంద మైన విగ్రహం ! అయినా, గోవిందలాలుకంటె సుందరు డని చెప్పలేం. ఇతను హరిద్రాగ్రామస్థుడుకాడు. అక్కడ పుట్టిపెరిగినదాన్నిగనక, అందరినీ నే నెరుగు దును. ఈ అందగాడితో ఒకటిరెండుమాటలు మాట్లాడితే కలిగే నష్టం ఏముంటుంది ? గోవిందలాలుపట్ల అవిశ్వాసినిగామాత్రం ప్రవర్తించను ," అనుకున్నది.

ఇప్పు డా మేడలో నివసిస్తున్నవా రెవరో తెలుస్తూనే వుంది। నిశాకరుడూ, కిటికీదగ్గిర నిలబడివున్న రోహిణీ కళ్ళతో ఏమేమో మాట్లాడుకున్నారు. హృద యాల్లో ఒకరి సోయగా న్నొకరు మెచ్చుకున్నారు. ఆ విధంగా వా రిద్దరూ పరవ



ఖులై వుండగా, మేడమీదికి పోయిన బహిరంగుడు గోవిందలాలుకు ఎవరో పెద్ద మనిషి ఒకడు అతడిని చూడవచ్చినట్టు చెప్పాడు.

"అతనిపే రేమిటి ?" అని ప్రశ్నించాడు గోవిందలాలు.

"అదంతా మీకే స్వయంగా చెపుతా నన్నాడు," అన్నాడు బహిరంగుడు

"ఆ పెద్దమని షెవరోగాని...యిప్పుడు చూ సేందుకు వీలులేదనిచెప్పి పంపెయి," అని ఆజ్ఞాపించాడు గోవిందలాలు.

విశాకరుడు రోహిణికేసి ఒక చిరునవ్వు నవ్వి, బహిరంగుడు ఎంతకూ రాక పోయేసరికి తనే మేడమీదికి వెళ్ళాడు. ఆ సమయంలో ఒక ముసల్మానుగాయకుడు హాలులో తంబురా శృతి చేసుకుంటూవున్నాడు. గోవిందలాలు ఎదురుగా కుర్చీలో కూర్చుని బహిరంగుణ్ణి కసురుతున్నాడు. నిశాకరుడు రావటం చూస్తూనే బహిరంగుడు, "అయ్యా, వీరే మిమ్మల్ని చూడవచ్చినవారు," అన్నాడు. గోవిందలాలు క్రోధం వుట్టిపడే కళ్ళతో నిశాకరుడికేసి చూస్తూ, "మీ రెవరు ?" అని ప్రశ్నించాడు.

"నా పేరు రాసవిహారిదేవు," అన్నాడు నిశాకరుడు.

"తమ వూరు ?"

"వరాహనగరం."

"ఎవర్ని చూడాలని వచ్చారు ?"

"తమర్నే !"

గోవిందలాలు ముఖమంతా కందగడ్డలా చేసుకుని, "మీరు నా అనుమతిలేకుండా దౌర్జన్యంగా నా గృహంలో ప్రవేశించారు. ఇది సహించరాని సంగతి. అయినా మీరు పెద్దమనుషుల్లా కనిపిస్తున్నారు కనక, ఒకటి చెప్పండి ; నాతో మీ కేంఽని ?" అని ప్రశ్నించాడు.

"పని చాలా చిన్నది. నన్ను చూడటానికే అవకాశం లేనంత పెద్దపనుల్లో మీరు వున్నట్టు కనిపించటంలేదు. ఏదో గానాబజానా ప్రారంభం కాబోతున్నట్టున్నది. అయినా, నావి రెండేరెండుమాటలు. సావధానంగా వినండి," అన్నాడు నిశాకరుడు.

"సరే, అలాగే చెప్పండి," అన్నాడు గోవిందలాలు కాస్త స్థిమితపడుతూ.

"మీ భార్య అయిన శ్రీమతి భ్రమరదాసి తన ఆస్తి అంతా నాకు దానం చేయ దలిచింది," అన్నాడు నిశాకరుడు.

ముసల్మాను గాయకుడు ఒకటి అంటూ ఒకవేలు ముడిచాడు. గోవిందలాలు ఆశ్చ ర్యంగా నిశాకరుడి ముఖంకేసి రెప్పవాల్చకుండా చూడసాగాడు.

"ఆ దానం నేను పుచ్చుకోదలుచుకున్నాను," అన్నాడు నిశాకరుడు.

"రెండుమాటలూ అయిపోయినై," అంటూ ముసల్మాను గాయకుడు రెండో వేలు ముడిచాడు.

నిశాకరుడు కోపంగా అతడికేసి తిరిగి, "ఉస్తాదుగారూ, నోరు మూయండి. ఇది కాకులా కొక్కిరాయిల లెక్కకాదు," అంటూ కసురుకుని, "మీ భార్య తన ఆస్తి అంతా నా పేర రాయదలిచింది, కాని దానికి మీ అనుమతి కావాలి. ఆమెకు మీ రున్నచోటు తెలియదు. నేను బయలుదేరి అన్నిచోట్లా వెతుక్కుంటూ యిక్కడికి వచ్చాను," అన్నాడు.

గోవిందలాలు జవాబేమీ యివ్వలేదు. భ్రమర అన్న పదం అతడి హృదయాంత రాళాలను శూలంపోటులా తాకింది. అతడు నిశ్చేష్టుడై శూన్యంలోకి చూస్తున్నట్టు కదలా మెదలక వుండిపోయాడు. అతడి మనస్థితిని గ్రహించిన నిశాకరుడు, "తమరు ఈ దానానికి అనుమతిస్తూ ఒక లేఖ రాసి యివ్వండి, చాలు. నా దారిన నేను పోతాను." అన్నాడు.

ఆ మాటలతో గోవిందలాలు ఊహాలోకంనుంచి వాస్తవప్రపంచానికి వచ్చాడు. నిశాకరుడు చెప్పినదంతా పచ్చి అబద్ధమే అయినా, అతడికి మాత్రం పరమ సత్యంలా తోచింది. అతడు ఎంతో శాంతంగా, "అయ్యా, ఆస్తి అంతా నా భార్యదే. ఆమె యిష్టంవచ్చినవారికి దాన్ని దానం చేసుకోవచ్చు. అందుకు నా అనుమతి అవ



సరంలేదు. కావాలంటే నేనూ జాబు రాసియిస్తాను. ప్రస్తుతానికిమాత్రం తమరు యిక్కణ్ణించి వెళ్ళండి," అన్నాడు.

గోవిందలాలు అలా అనగానే నిశాకరుడికి యిక మాట్లాడేందుకు అవకాశం లేకుండాపోయింది. అతడు మెట్లు దిగి కిందికి వచ్చేశాడు. గోవిందలాలు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

గోవిందలాలు తంబురా తీసుకుని తీగలను మీటేంతలో, ఒక తీగ ఫటేల్‌మంటూ తెగి అతడి మెడకు చుట్టుకున్నది.

*　　*　　*

అతడు భ్రమరను గురించి విని రెండు సంవత్సరాలకాలం గడిచిపోయింది. తనామెకు ఎంతో అన్యాయం చేశానన్నభావం అతడిహృదయాన్నిపట్టి పీడించసాగింది. దుఃఖంతో ఆపాదమస్తకం కంపించిపోతూ అతడు మంచంమీద బోర్లాపడిపోయాడు. హరిద్రాగ్రామం వెళ్ళి. ఏనాటికైనా తనామెను చూడగలడా ? అలాంటి అవకాశం తనకిక యీ జన్మలో లభించదు. తను దుష్టుడు...అవినీతి పరుడు...పాపి...

గోవిందలాలు తన గదిలో యిలా దుఃఖిస్తూన్న సమయంలో రోహిణి తన గదినుంచి బహిరంగుణ్ణి సౌంజ్ఞచేసి పిలిచింది. నిశాకరుడు గోవిందలాలుతో చేసిన సంభాషణ అంతా ఆమె తలుపుచాటున వుండి విన్నది. నిశాకరుడు ఆమె అక్కడినుంచి తనకేసి క్రీగంటితో చూస్తూవుండటం గమనించాడు.

రోహిణి బహిరంగుడితో, "ఒక ముఖ్యమైన పని నీవల్ల కావాలి. యజమాని కేమాత్రం తెలియకూడదు. నీకు పదిరూపాయి లిస్తాను. ఇంతకుముందు యజమానితో మాట్లాడివెళ్ళిన పెద్దమనిషి మా గ్రామస్థుడు అతణ్ణుంచి మా పినతండ్రి గారి యోగక్షేమాలు తెలుసుకోవాలి. నువ్వు వెంటనే కిందికి వెళ్ళి ఆయన మన తోటలో ఎక్కడైనా రహస్యంగా వుండేట్టు చూడు. తరవాత నే నక్కడికి వచ్చి మాట్లాడతాను," అని చెప్పింది

బహిరంగుడు పదిరూపాయీల బహుమానం పేరు వింటూనే ఎక్కడలేని ఆనందం పొందాడు. అతడు వేగంగా మేడ దిగి నిశాకరుడికోసం పరిగెత్తాడు. నిశాకరుడు ఇంటి తలుపులూ, ద్వారబంధాలూ పరీక్షిస్తున్నాడు.

"అయ్యా, తమకు తంబాకు కావాలా ?" అని అడిగాడు బహిరంగుడు.

"తంబాకా ? గృహ యజమానే అలాంటి మర్యాదలు చెయ్యలేదు, సేవకుడివి నీవల్ల నేమవుతుంది ?" అన్నాడు నిశాకరుడు.

బహిరంగుడు రహస్యం చెపుతున్నట్టు చిన్న గొంతుతో, "అయ్యా, మీతో ఒక రహస్యం చెప్పాలి. కొంచెం యీ తోటలోకి రండి," అంటూ నిశాకరుణ్ణి తోటలోకి తీసుకుపోయి, రోహిణి చెప్పిన మాటలు అతడితో చెప్పాడు.

"మీ యజమానురాలితో మాట్లాడేందుకు నా అభ్యంతరం ఏమీలేదు. కాని, అది యిక్కడ ఎలా సాధ్యం ? మీ యజమాని నన్ను కసిరి పంపేశాడు. ఈ తోటలో నే నాయన భార్యతో మాట్లాడుతున్నట్టు పశికడితే నా ప్రాణం నిలువునా తీసేస్తాడు. నేను దూరప్రాంతంవాణ్ణి. ఇక్కడ నన్ను కాపాడేవా శ్శెవరూ లేరు. మీ యజమానురాలికి ఆమె పినతండ్రి ఒక వార్త చెప్పమన్నాడు. నే నిక్కడికి వచ్చేటప్పుడు నదిలోకున్న మెట్లదగ్గిర ఒక పెద్ద మర్రిచెట్టు చూశాను. ఆ స్థలం నీకు బాగా పరిచయమేనా ?" అని అడిగాడు నిశాకరుడు.

"ఆ ప్రదేశమంతా నాకు బాగా తెలుసు," అన్నాడు బహిరంగుడు.

"అయితే మీ యజమానురాలిని చీకటి పడినతరవాత ఆ మర్రిచెట్టుదగ్గిరకు రమ్మను. నే నక్కడే కూర్చునివుంటాను. ఆమెకు పినతండ్రి చెప్పమన్నమాటలు చెప్పి నా దారిన నేను పోతాను ఒకవేళ యజమానినుంచి ఎలాంటి ప్రమాదమైనా వచ్చేట్టు కనబడిందో – ఆ చీకటిలో నదీతీరంవెంట పారిపోవటం తేలిక. ఈ తోటలో అయితే, నన్ను పట్టుకుని చంపి పాతేసినా తెలుసుకునే దిక్కుండదు," అన్నాడు నిశాకరుడు.

బహిరంగుడు రోహిణిదగ్గిరకు వెళ్ళి నిశాకరు డన్న మాటలు చెప్పాడు. ఆమె చీకటిపడినతరువాత నదీతీరంలో వున్న మర్రిచెట్టుదగ్గిరకు పోయి నిశాకరుణ్ణి కలుసు కునేందుకు అంగీకరించింది. బహిరంగుడు యీ వార్త నిశాకరుడికి చెప్పి. మేడమీదికి వెళ్ళిపోయాడు. నిశాకరుడు తోటలోనుంచి బయిటికి వచ్చేంతలో గోవిందలాలు ఇంటి రెండవ సేవకుడైన గోపనుడు అతడికి ఎదురయ్యాడు నిశాకరుడు అతణ్ణి ఆపి, "ఈ ఇంట్లో ఎంతకాలంగా పనిచేస్తున్నావు ?" అని అడిగాడు.

"మా యజమాని యీ మేడలో నివాసం ఏర్పరచుకున్నప్పటినుంచీ," అన్నాడు గోపనుడు.

"జీతం ఏమిస్తున్నారు ?"

"కూడూ గుడ్డా యిచ్చి, నెలకు మూడురూపాయిలు."

"ప్చ ప్చ.. అంత కొద్దిపాటి జీతానికి నీవంటి మంచినౌకరు దొరకటం చాలా కష్టం." అన్నాడు నిశాకరుడు సానుభూతి ఒలకబోస్తూ.

"ఈ ప్రాంతాల యింతకన్న మంచిజీతం యిచ్చేవాళ్ళెవరూ లేరు," అంటూ గోపనుడు ఏడ్పుముఖం పెట్టాడు.

"అయితే, నా వెంట మా ప్రాంతానికి రా. అన్నవస్త్రాలిచ్చి, నెలకు ఎంత లేదన్నా నీకు పదీపన్నెండు రూపాయి లిచ్చేఏర్పాటు చేస్తాను." అన్నాడు నిశాకరుడు.

"అయ్యా, మీ పుణ్యంవుంటుంది. నన్ను మీ వెంట తీసుకుపొండి," అంటూ గోపనుడు నిశాకరుణ్ణి బతిమాలాడు.

"ఓ అలాగే తీసుకుపోతాను. వచ్చేముందు మీ యజమానికి మేలుకూర్చే ఒక్క పని చెయ్యి. చాలా జాగర్తగా చెయ్యాలి. ఈ రాత్రి నేను నదిఒడ్డు నన్న మర్రి చెట్టుకింద వుంటే, తాను అక్కడికి వస్తానని, మీ యజమానురాలు నాకు కబురు చేసింది. ఈ సంగతి రహస్యంగా మీ యజమానితో చెప్పగలవా?" అన్నాడు నిశాకరుడు

"తప్పక చెప్తాను మా యజమాని చాలా మంచివాడు. యజమానురాలు చాలా చెడ్డది ఈ రోజుతో ఆయన ఆ దుర్మార్గురాలి వలలోనుంచి బయట పడతాడు." అన్నాడు గోపనుడు.

"అంతే జరుగుతుంది. కాని, మీ యజమానికి నేను చెప్పుతున్న మాటలు యిప్పుడే చెప్పగూడదు. చీకటి పడినతరువాత, మీ యజమానురాలు ఇల్లు వదలి, నదికేసి పోవడం చూసి—అప్పుడు యీ రహస్యం ఆయనకు చెప్పాలి. బహిరంగుడికి యీ సంగతు లేవీ తెలియనివ్వకు," అన్నాడు నిశాకరుడు

గోపనుడు విశాకరుడికి నమస్కరించి అతడి పాద ధూళి తీసుకని వెళ్ళిపోయాడు. విశాకరుడు అక్కడినుంచి బయలుదేరి నదీతీరంలో వున్న రావిచెట్టుకిందికి వెళ్ళి కూర్చున్నాడు. క్రమంగా చీకటి పడింది దూరంగా నక్కల అరపులు వినబడ సాగినై. గోవిందలాలు మేడలోని దీపపుకాంతుల కేసి చూస్తూ, అతడు తాను చేయ నున్న దుర్మార్గకార్యాన్ని గురించి ధర్మాధర్మ చర్చ చేయసాగాడు. ఒక స్త్రీని సర్వనాశనం చేసేందుకు తాను పెద్ద పన్నాగడ వేశాడు. ఆ స్త్రీ తనకు చేసిన ద్రోహం ఏమీ లేదు. కాని...ఒక మిత్రుడి కుహూర్తె మేలు కోరి తాను క్రూరకర్మకు పూనుకోవటం జరిగింది. దుష్టుల్ని దుష్టమార్గానే శిక్షించాలి. ఏమైనా తాను చేయ బోతున్నది పాపకార్యమే! ఉహుం ఎలా? ఏది పాపమో, ఏది పుణ్యమో నిర్ణయించ టానికి నే నెవణ్ణి? అన్నిటికీ ఆ సర్వేశ్వరుడే వున్నాడు. బహుశా ఆయనే నన్నీ కార్యానికి ప్రోత్సహించివుండవచ్చు......

త్వయా హృషీకేశ హృది స్థితేన
యథా నియుక్తోస్మి తథా కరోమి.

ఇంతలో ఒక ఆకారం చీకట్లో మెల్లగా నడుస్తూ వచ్చి అతడికి కొంచెం దూరంలో నిలబడింది. "ఎవరు వారు?" అని ప్రశ్నించాడు విశాకరుడు.

"రోహిణిని."

"ఇంత ఆలశ్య మైందేం?"

"ఇంటిలో ఎవరూ చూడకుండా బయలుదేరి రావలసివుండటంవల్ల, కొంచెం ఆలశ్యం అయింది మీరు చాలా సేపటినుంచి ఎదురుచూస్తున్నా రనుకుంటాను."

"ఎదురుచూస్తూ యీ చీకట్లో కూర్చోవటం నా కేమీ కష్టం కలిగించలేదు. కాని, నీవు నన్ను మరిచిపోయివుంటా వనుకున్నాను."

"అలా మరిచిపోయే స్వభావమే నాదైతే, యిలాంటిగతి నాకు పట్టేదికాదు. ఒకర్ని మరిచిపోలేక ఇల్లు వదిలి యీ దేశంకానిదేశం వచ్చాను. నిన్ను మరిచిపో లేక చీకట్లో యిల్లువదిలి యింతదూరం నడిచాను," అన్నది రోహిణి.

రోహిణి మాట ముగించేసరికి, వెనకనుంచి ఎవరో ఆమె మెడమీద చేయి వేసి బలంగా పట్టుకున్నారు రోహిణి కంపించిపోతూ, "వదలండి! ఎవరూ?" అన్నది.

"నీపాలిటి యముణ్ణి!" అన్న కఠోరమైన కంఠస్వరం జవాబిచ్చింది.

ఆ స్వరం వింటూనే అతడు గోవిందలాలని రోహిణి గ్రహించి, "నన్ను వదులు! ఏ దురుద్దేశంతోనూ నే నిక్కడికి రాలేదు. అతన్నడుగు!" అంటూ విశా కరుడు కూర్చునివున్న దిక్కుకేసి చేయి చూపింది. కాని, అక్కడ అతడు లేడు.



గోవిందలాలు రోహిణి మెడపట్టుకోవటం చూస్తూనే అతడు అక్కణ్ణించి పారిపోయాడు.

"అక్కడ ఎవ్వరూ లేరు  పద ఇంటికి." అంటూ గోవిందలాలు రోహిణిని మెడపట్టుకుని వెనక్కు తిప్పి ఒక్కతోపు తోశాడు.

ఇంటికి చేరగానే గోవిందలాలు నౌకర్లిద్దరినీ గేటుదగ్గిరే వుండమనీ, మేడపైకి రావద్దనీ చెప్పి, రోహిణిని పడకగదిలోకి తీసుకుపోయి తలుపులు మూశాడు. రోహిణి గడగడ వణుకుతున్నది.

"రోహిణీ! అసలు నీకూ నాకూ సంబంధ మేమిటి?" అన్నాడు గోవిందలాలు.

"లేదనకుంటే ఏమీ లేదు. నీ కాళ్ళదగ్గిర యింతచోటు యిచ్చినంతకాలం నేను నీ దాసిగా బతుకుతాను. యివ్వనప్పుడు ఏమీలేదు," అన్నది రోహిణి.

"నీ కోసం నేను కోరి కష్టాలు తెచ్చుకున్నాను. ధర్మవిహితంగా వివాహ మాడిన నా ధర్మపత్ని భ్రమరను నీకోసం విడిచిపుచ్చాను. నీవు నీచురాలివి, పాపివి..". అంటూ గోవిందలాలు క్రోధోద్రేకంతో రోహిణిని ఒక్క తన్ను తన్నాడు. రోహిణి కిందపడి ఏడ్వసాగింది.

"లే! నిలబడు!" అంటూ గోవిందలాలు హుంకరించాడు. రోహిణి లేచి నిలబడింది.

"నీవు లోగడ ఒకసారి కొలనులో పడి చావాలని ప్రయత్నించావు. అందుకు మరొకసారి సాహసించగలవా?" అని ప్రశ్నించాడు గోవిందలాలు.

రోహిణి హీనస్వరంతో, "ఇప్పుడు చావాలని నాకులేదు," అన్నది.

"అయితే కదలకు! అక్కడే నిలబడు!" అంటూ గోవిందలాలు టేబిలు సొరుగులోనుంచి పిస్తోలు బయటికి తీసి ఆమె తలకు గురిచేసి, "ఏమంటావ్? చావ టానికి సిద్ధంగా వున్నావా?" అని అడిగాడు.


రోహిణి వెంటనే జవా బివ్వలేదు. ఆమె మనసులో, "నే నెందుకు చచ్చిపోవాలి? ఇతడు నన్ను వదిలిపోతే, పోనీ; మనసులో అన్నివేళలా యితన్నే తలుచుకుంటూ కాలం గడుపుతాను. ఈ ప్రసాదపురంలో యితడితో గడిపిన సుఖమయ జీవితాన్ని మననం చేసుకుంటూ శేషజీవితాన్ని ముగిస్తాను," అనుకున్నది.

"మాట్లాడవేం?" అంటూ గోవిందలాలు పిస్తోలూపుతూ, ముందు కొకడుగేశాడు.

రోహిణి కంపితగాత్రంతో, "నన్ను చంపకు. నీ ఇష్టమైన చోటుకు నువ్వు వెళ్ళు. నే నేం అడ్డురాను. ఈ క్షణానే యీ ఇల్లువిడిచి నా దారిన నేను పోతాను," అన్నది బ్రతిమాలుతూ.

గోవిందలాలు చేతిలోని పిస్తోలు ఢాం అని మోగింది. రోహిణి ఒక్క కేకపెట్టి కిందపడిపోయి, ఒకటి రెండుసార్లు కాళ్ళు చేతులు కొట్టుకుని వూరుకున్నది. ఆమె తలమీద తగిలిన గాయాన్నుంచి రక్తం సంతతధారగా స్రవించసాగింది. గోవింద లాలు ఆమె కేసి ఒక క్షణంకాలం కన్నార్పకుండా చూసి, పిస్తోలును అక్కడే వదవేసి గదినుంచి బయటికి పరిగెత్తాడు.

పిస్తోలు మోగిన శబ్దం విని మేడమీదికి వచ్చిన బహిరంగుడూ, గోపనుడూ గదిలో మరణించివున్న రోహిణిని చూసి భయకంపితు లయ్యారు. వాళ్లు తమ యజమానికోసం మేడ అంతా గాలించారు. అతడు కనబడలేదు.



తెల్లవారుతూనే ప్రసాదపురానికి ఆరుమైళ్ళ దూరంలో వున్న పోలీసుస్టేషనునుంచి ఇనస్పెక్టరూ కొందరు పోలీసులూ గోవిందలాలు నివశించిన మేడ దగ్గరకు వచ్చి రోహిణి శవాన్ని గవర్నమెంటు హాస్పిటలుకు పంపి, పంచాయితీ చేయించారు. గోవిందలాలు ఆ ప్రాంతాన చునీలాలుదత్తు అన్నపేరుతో చలామణీ అయాడు. అతడే ప్రాంతాన్నుంచి వచ్చాడో అతడి నౌకరులకుకూడా తెలియదు. ఆ కారణం వల్ల పోలీసులు ఆ కేసులో చేయగలిగిం దేమీలేక, జెస్సూరు జిల్లా కేంద్రంలో వున్న పై ఆఫీసర్లకు హంతకుడు దొరకలేదని రిపోర్టు పంపారు.

ప్రసాదపురంలోని ఒక సత్రంలో విడిదిచేసివున్న నిశాకరుడికీ. మాధవీనాథ సర్కారుకూ పోలీసుల హడావిడీ, ప్రజలు చెప్పుకునే మాటలద్వారా రోహిణిని గోవిందలాలు హత్యచేసి పారిపోయా డని తెలిసింది. ఆ వెంటనే వారు యిక అక్కడ వుండటం క్షేమం కాదనుకుని కలకత్తాకు వెళ్ళిపోయాడు.

## *11*

ఐదు సంవత్సరాల కాలం యిట్టే గడిచిపోయింది. భ్రమర అత్తగారి ఇంటనే వుంటున్నది. ఆమె ఉబ్బసపు వ్యాధితో బాధపడుతున్నది. శరీరం క్రమక్రమంగా క్షీణిస్తున్నది. తన భర్త ఏదో ఒకనాడు ఇంటికి తిరిగి రాగలడని ఆమె ఇంతకాలంగా

ఎదురు చూస్తున్నది ఇవ్వవలసినచోట సరిగా లంచాలు యిస్తే హత్యానేరాలనుంచి కూడా బయటపడవచ్చని. ఆమెతండ్రి మాధవినాధసర్కారు ధైర్యం చెప్తున్నాడు.

హఠాత్తుగా ఒక రోజున దివానుకు గోవిందలాలునుంచి వుత్తరం వచ్చింది. తాను సన్యాసివేషంలో బృందావన క్షేత్రంలో వుండగా పోలీసులు తనను పట్టుకుని హత్యానేరం మోపి. జెస్సూరుకు తీసుకుపోయారనీ. తనను రక్షించదలిస్తే యిదే సమయమనీ — అతడు దివానుకు రాశాడు.

దివాను ఈ వార్త ను భ్రమరకు తెలియజేశాడు. భ్రమర తనతండ్రికి కబురు చేసి ఆయన రాగానే భర్తసంగతి అతడికి చెప్పి. "నాన్నా! ఆయన్ని రక్షించటానికి నీ చేతనైనంతలో గట్టిప్రయత్నం చేయి ఇగో. యాభైవేల రూపాయిలనోట్లు. వెంటనే బయలుదేరి జెస్సూరుకు పోయి. ఆయన ఉరిశిక్ష తప్పించు." అంటూ కళ్ళనీళ్ళతో తండ్రిని వేడుకున్నది.

మాధవీనాధుడు జెస్సూరుకు పోయి విచారించగా. గోవిందలాలు కేసు మేజస్ట్రేటు కోర్టులో విచారణ ముగిసిందని. యిప్పుడు సెషన్సు కోర్టులో కేసు నడుస్తున్నదనీ. డిటెక్టివ్ పిచలీఖానుకు గోవిందలాలే రోహిణిని చంపిన వ్యక్తి అని తెలిసినా. దాన్ని కోర్టులో రుజువుచేసేందుకు సాక్ష్యమాత్రం దొరకలేదు. గోవిందలాలు సేవకులిద్దరిలో గోపనుడు నిశాకరుడి ఇంట కలకత్తాలో వుంటున్నాడు. బహిరంగు డెక్కడ వున్నదీ తెలియలేదు. ఈ స్థితిలో డిటెక్టివ్ పిచలీఖాను ముగ్గురు వ్యక్తులకు కొంచెం డబ్బూ. బాగా భయమూ పెట్టి వారిచేత మేజస్ట్రేటు కోర్టులో అబద్ధసాక్ష్యం చెప్పించాడు.

మాధవీనాధుడు ఆ ముగ్గురు సాక్షులనూ కలుసుకుని ఒక్కొక్కరికి వెంటనే వెయ్యిరూపాయిలిచ్చేటట్టూ. తను చెప్పుతున్నవిధంగా సెషన్సుకోర్టులో సాక్ష్యం చెప్పిన తరవాత మరొక వెయ్యిరూపాయిలిచ్చేటట్టూ ఆశ చూపాడు.

"మేజస్ట్రేటు దగ్గిర హంతకుడు గోవిందలాలని మేము సాక్ష్యం చెప్పాం. ఇప్పుడు జడ్జిదగ్గిర మరోలా చెబితే. అబద్ధం చెప్పినందుకు మమ్మల్ని జైల్లో పెట్టరా?" అని వాళ్ళడిగారు.

"అలాంటి చిక్కేంరాదు డిటెక్టివ్ పిచలీఖాన్ తప్పుడుసాక్ష్యం చెప్పమని. మిమ్మల్ని కొట్టి తిట్టాడని జడ్జీతో చెప్పండి." అని సలహా యిచ్చాడు సర్కారు.

ఆ సాక్షులు తమ జన్మలో వందరూపాయిలు కూడా ఒక్కసారి చూచినవాళ్ళు కారు. రెండువేల రూపాయిలు కళ్ళముందు పడగానే వాళ్ళు సర్కారు చెప్పిన

విధంగా సాక్ష్యం యివ్వటానికి అంగీకరించి, తమకు తామే శరీరంమీద చిన్న గాయాలు చేసుకున్నారు.

మరసటిరోజున సెషన్స్‌కోర్టులో విచారణ ప్రారంభమైంది గోవిందలాలును జైలునుంచి తీసుకువచ్చి బోనులో నిలబెట్టారు. ప్రభుత్వం తరపు వకీలు మొదటి సాక్షిని ప్రశ్న లడగసాగాడు.

"నువు చునీలాలుదత్తు అన్న పేరుతో చలామణీ అయిన గోవిందలాలు నెరుగుదువా ?" అని ప్రశ్నించాడు వకీలు.

"ఎరుగను," అన్నాడు సాక్షి.

"రోహిణిని ఎరుగుదువా ?"

"రోహిణి ఎవ్వరు ?" అన్నాడు సాక్షి ఆశ్చర్యం నటిస్తూ.

"ప్రసాదపురంలోని మేడలో హత్యచేయబడిన యువతి," అంటూ వకీలు గద్దించాడు.

"నే పుట్టిం తరవాత ఆ ప్రసాదపురాని కింతవరకూ వెళ్ళలేదు," అన్నాడు సాక్షి అమాయికంగా.

"ఆమె హత్యసంగతికూడా నీవు వినలేదా ?"

"ఆత్మహత్య చేసుకున్నట్టు విన్నాను."

వకీలు యిక అతణ్ణి ప్రశ్నించి లాభంలేదని గ్రహించి, మేజిస్ట్రేటువద్ద అతడు చెప్పిన సాక్ష్యాన్ని చదివి జడ్జికి వినిపించి, "మేజిస్ట్రేటువద్గిర నే నిప్పుడు చదవిన విధంగానే, నీవు సాక్ష్యం పలకలేదా ?" అని ప్రశ్నించాడు.

"పిచలీఖాన్ కొట్టిన దెబ్బలు భరించలేక, నేనూ మరియిద్దరం అతడు చెప్పమన్నట్టే సాక్ష్యం చెప్పాం. చూడండి, అతడు నన్ను కొట్టిన దెబ్బలు," అంటూ సాక్షి చొక్కా విప్పి, తన శరీరంమీద స్వయంగా చేసుకున్న గాయాలను వకీలుకూ, జడ్జికీ చూపించాడు.

ఆ తరవాత వకీలు ప్రశ్నించిన యిద్దరు సాక్షులుకూడా మొదటివాడిలాగే, పిచలీఖాన్ తమను హింసించి తప్పుడు సాక్ష్యం చెప్పించాడని జడ్జి ఎదుట మొర పెట్టుకున్నారు. జడ్జి గోవిందలాలు రోహిణిని హత్యచేశాడనేందుకు ఆధారం ఏమీ లేదని కేసు కొట్టేశాడు.

గోవిందలాలును విడుదల చేయవలసిందిగా జడ్జినుంచి జైలు అధికారికి యింకా ఆజ్ఞ పోనందున, పోలీసులు అతణ్ణి తిరిగి జైలుకు తీసుకుపోయారు. మాధవీనాథ

సర్కారు దారిలో తన అల్లుణ్ణి కలుసుకుని, తను పట్టణంలో ఫలానిహోటల్లో వుంటున్నానని చెప్పి, విడుదల అవగానే అక్కడికి వచ్చి తనను కలుసుకోమన్నాడు.

మర్నాడు గోవిందలాలు జైలునుంచి విడుదలయాడు; కాని, అతడు తన మామగా రున్న హోటలుకు పోక ఎటో వెళ్ళిపోయాడు. మాధవీనాధసర్కారు అతడి కోసం నాలుగైదు రోజులు పట్టణమంతా గాలించి, అతడు కనబడకపోవటంతో హరిద్రాగ్రామం తిరిగి వచ్చాడు.

భ్రమర తండ్రిద్వారా జరిగిన సమాచార మంతా విని చాలా దుఃఖించింది. తన భర్తకు తనను చూడటం యిష్టంలేదనీ, ఆకారణంవల్లనే జైలునుంచి విడుదల కాగానే తండ్రికి కనిపించకుండా ఎటో వెళ్ళిపోయాడనీ అనుకున్నది.

భ్రమర వూహించినదాంట్లో కొంత సత్యం లేకపోలేదు. గోవిందలాలు జెస్సూరు నుంచి సరాసరి ప్రసాదపురం వెళ్ళి, పూర్వపు తన మేడా తోటా ఎలావున్నవో చూసుకున్నాడు. అ విప్పుడు శిధిలావస్థలో వున్నవి. యజమాని లేకపోవటంతో, పొరుగు గ్రామాలవాళ్ళు ఇంట్లో ఎవరిచేతికి దొరికిన వస్తువులు వారెత్తుకుపోయారు. గోడలూ, పైకప్పుకూడా కొంతకూలి, మిగతాది కూలటానికి సిద్ధంగా వున్నది. గోవిందలాలు ఆ జీర్ణగృహాన్నీ, స్థలాన్నీ ప్రసాదపురంలోని ఒకరికి స్వల్పధరకు అమ్మి, ఆ డబ్బుతో కలకత్తా చేరి, అక్కడ నివశించసాగాడు. ఈ విధంగా రెండేళ్లు గడిచినై. గోవిందలాలు దగ్గర డబ్బంతా అయిపోయింది కొన్నాళ్ళు వస్తులతో గడిపాడు. జీవితం దుర్భరం కాసాగింది ఆ స్థితిలో అతడు భార్యకు వుత్తరం రాశాడు అందులో: తాను నిర్ధనుణ్ణయిపోయాననీ, దినం గడవటమే కష్టంగా వున్నదనీ, కాశీలో వున్న తన తల్లికూడా మరణించిందనీ, తను చేసిన అన్యాయాన్ని మరిచిపోయి, ఏదైనా ధనసహాయం చేయమనీ కోరాడు.

ఆ వుత్తరం చదివి భ్రమర శోకసముద్రంలో మునిగిపోయింది. చెడిన దాంపత్యం మరి బాగయే ఆశ ఆమెకు కనిపించలేదు తన ఆరోగ్యంకూడా పూర్తిగా చెడిపోయింది. తను మరెంతోకాలం బతకదు.

భ్రమర యీ విధంగా ఆలోచించి భర్తను తిరిగి హరిద్రాగ్రామం రావలసిందనీ, ఆస్తి అంతా అతడిదేననీ, అతడు వచ్చేరోజు తెలిస్తే, అతడి ఆహ్వానానికి తగిన ఏర్పాట్లన్నీ చేసి, తాను పుట్టింటికి వెళ్ళిపోగలననీ తెలియపరిచింది. "మీ పిత్రార్జితం వున్నది వున్నట్టుండటమేగాక, ఏటా వచ్చే ఆదాయం ఖర్చుచేయక వుంచటంతో — చాలా వృద్ధయింది. నేను మీ ఆస్థిలోనుంచి కోరేదల్లా ఎనిమిదివేల రూపాయిలు మాత్రం. అందులో మూడువేల రూపాయిలు పెట్టి గంగాతీరాన చిన్న యిల్లు



కట్టుకుంటాను. తతిమ్మా అయిదువేలతో జీవితశేషం గడుపుతాను. మీ ప్రత్యుత్తరం కోసం ఎదురు చూస్తూంటాను," అని వుత్తరం ముగించింది.

గోవిందలాలుకు ఆ వుత్తరం చాలా మానసికక్షోభ కలిగించింది. భ్రమర తన ముఖం చూడటానికి యిష్టంలేకే, తన రాక ముందుగా తెలియపరిస్తే, తాను పుట్టింటికి వెళతానని రాశిందని అతడు అపోహపడ్డాడు. ఆ కారణంవల్ల అతడు తాను హరిద్రాగ్రామం రానని రాస్తూ, "నాకు తిండికీ, బట్టకూ సరిపోయే విధంగా నెలకు యింతఅని డబ్బు పంపవలసిందిగా ప్రార్థిస్తున్నాను,'' అని తెలియపరిచాడు.

భ్రమర ఆ ప్రత్యుత్తరం చూసి నిస్పృహ చెందింది. ''మీకు నెలకు అయిదువందల రూపాయిలు పంపే ఏర్పాటు చేశాను. కాని మీరు యిక్కడికి తిరిగివచ్చి, మీ పిత్రార్జితం హాయిగా అనుభవించటం బావుంటుంది. నాకోసం మీరు స్వగ్రామం రాకుండా, ఎక్కడో కాందిశీకుడుగా బతకవలసిన అవసరంలేదు. నా జీవితం ముగిసేరోజులు దగ్గిరపడుతున్నాయి," అని వుత్తరం రాశింది.

మార్గశిరమాస ప్రారంభంలో భ్రమర పూర్తిగా మంచం పట్టింది. ఎంతో కాలంగా ఔషధాలు సేవిస్తున్నా, ఆమెను పట్టి పీడిస్తున్న మానసిక శారీరక వ్యాధులు కొంత ఉపశమనం పొందినవే తప్ప సాంతం నయంకాలేదు భర్త తను జీవించి

వుండగా హరిద్రాగ్రామం రాదని తెలుసుకున్న తరవాత ఆమెకు జీవితంమీద ఆశ పూర్తిగా నశించింది.

కూతురు మంచంపట్టిందని తెలియగానే మాధవీనాధసర్కారు తన పెద్ద కుమార్తె యామినిని వెంటబెట్టుకుని హరిద్రాగ్రామం వచ్చాడు భ్రమర అక్కగారూ తండ్రీ కలిసి ఆమెకు ఎన్నోవిధాల ధైర్యం చెప్పి, బాగాతెలిసిన మరొక వైద్యుడితో చికిత్స చేయించసాగారు. అయినా భ్రమర శరీరస్థితిలో మార్పులేదు.

పుష్యమాసంకూడా గడిచిపోయింది. భ్రమర ఆరోగ్యం కొంచెం కూడా బాగుపడలేదు. మాఘమాసం వచ్చింది భ్రమర యిక తనకు మందులతో ఉపయోగం లేదనిచెప్పి, వైద్యుడిచ్చిన మందులు వాడటం మానేసింది.

ఒకనాడు భ్రమర తన అక్కగారైన యామినితో, "అక్కా! ఫాల్గుణమాసం కూడా వచ్చింది. ఫాల్గుణ పూర్ణిమ రాత్రి నేను తప్పకుండా మరణిస్తాను. నీవు నన్ను కొంచెం జాగ్రత్తగా కనిపెట్టుకు వుండాలి. ఆ పూర్ణిమ రాత్రి వెన్నెల చూచిగాని నేను మరణించదలచలేను. ఏకారణంవల్లనైనా, ఆరాత్రి మెలుకువగా లేకపోతే, నువ్వు నన్ను హెచ్చరించాలి," అని చెప్పింది.

రోజులు గడిచినై. భ్రమర మరింతగా క్షీణించిపోయి, మంచానికి అంటిపెట్టుకుపోయింది. ఇక ఆమె ఎన్నోరోజులు జీవించదని అందరూ భావించారు. అది పూర్ణిమా దినం. తన మంచందగ్గరకు వచ్చిపోయేవాళ్ళ సంభాషణవల్ల ఆ సంగతి గ్రహించిన భ్రమర అక్కను దగ్గరకు పిలిచి, "అక్కా యీరాత్రి నేను తప్పక మరణిస్తాను. సూర్యాస్తమయానికి యింకా ఎంతకాలం వున్నది?" అని అడిగింది.

యామిని దుఃఖంతో విహ్వలురాలై మాటాడలేకపోయింది. భ్రమర తిరిగి అదే ప్రశ్న అడిగింది. అప్పుడు యామిని దాపున వున్న కిటికీ తెరిచి బయటికి తొంగి చూసి, "సూర్యాస్తమానం ఎప్పుడో అయిపోయింది ... చక్కగా వెన్నెల కాస్తున్నది," అని చెప్పింది.

భ్రమర మౌనంగా ఊరుకున్నది. యామిని చెల్లెలిదగ్గరకు వచ్చి ముఖం పరీక్షించి చూసింది. ఆమె కళ్ళనుంచి సంతతధారగా అశ్రువులు ప్రవహిస్తున్నవి.

"భ్రమరా! యిప్పుడు ... యీ సమయంలో యింకెందుకు దుఃఖిస్తావు," అన్నది యామిని.

"అక్కా! నా మరణ సమయంలో అయినా, ఏడేళ్లుగా తీరని ఒకకోర్కె సఫలమవుతుందని యిన్నాళ్ళుగా నమ్ముతూ వచ్చాను. నన్నాయన పరిత్యజించి తల్లిగారితో కాశీకి బయలుదేరి వెళ్ళేరోజున, నా మరణ సమయంలో అయినా నా



స్వామి దర్శనభాగ్యం కలిగించమని పరమేశ్వరుణ్ణి ప్రార్థించాను అంతేగాక, నా స్వామితో నేనేగనక పతివ్రతనైతే మళ్ళీ ఏదో ఒకనాడు మీరు వచ్చి నాకు దర్శనం యిస్తారని, ప్రతిజ్ఞ చేశాను అవన్నీ కల్లలయినై ఇది నా మరణదినం నా స్వామిని ఒక్కగా నొక్కక్షణం చూడగలిగితే, నా ఏడేళ్ళ దుఃఖం మరిచిపోయి, హాయిగా మరణించేదాన్ని." అన్నది భ్రమర

"ఆయన్ని చూడాలని వున్నాదా?" అని ప్రశ్నించింది యామిని

భ్రమర ఆమాట వింటూనే, మంచం మీదినుంచి మెరుపుతీగలా లేచి, ఆపాద మస్తకం వణికిపోతూ, "ఎవరిని గురించి నువ్వు చెప్పేది?" అని ప్రశ్నించింది.

'గోవిందలాలును గురించే చెప్తున్నాను ఆరోగ్యం బాగా క్షీణించిపోయిందని నాన్నగారు రాయగానే, అత డిక్కడికి వచ్చాడు నీ వున్న యీ స్థితిలో అతణ్ణి చూడటం మంచిదికాదేమో అని యిన్నాళ్ళుగా వూరుకున్నాను అతడికీ నిన్ను చూచే ధైర్యం లేనట్టున్నది." అన్నది యామిని

"అక్కా! నా స్వామిని ఒక్కసారి యీ జన్మకు మరొక్కసారి చూపించు." అంటూ భ్రమర గది అన్నిమూలలకేసీ చూడసాగింది యామిని గదినుంచి బయిటికి వెళ్ళింది కొద్దిసేపటితరవాత గోవిందలాలు అడుగులో అడుగు వేసుకుంటూ.. ఏడేళ్ళ తరవాత . తన శయనగృహంలో ప్రవేశించాడు

భ్రమర అతణ్ణి చూసి దుఃఖించసాగింది. గోవిందలాలుకూడా ఆమెను చూసి దుఃఖవివశు డయాడు. రెండు మూడు క్షణాలకాలం యిలా గడిచిపోయింది. భ్రమర తన భర్తను మంచంమీద కూర్చోవలసిందిగా సౌజ్ఞ చేసింది గోవిందలాలు వచ్చి కూర్చున్నాడు భ్రమర తన చేతితో గోవిందలాలు పాదాలు తాకి, అతని పాదరేణువులను శిరస్సుపైన జల్లుకున్నది.

"స్వామీ! ఇప్పటికైనా నా అపరాధా లన్నిటినీ క్షమించానని చెప్పండి!" అన్నది భ్రమర బలహీనస్వరంతో గోవిందలాలు మాట్లాడలేకపోయాడు అతడు భార్య హస్తాలను తన హస్తాల్లోకి తీసుకున్నాడు. భ్రమర తృప్తిగా, ప్రేమగా భర్తముఖంలోకి ఒకసారి చూసి శాశ్వతంగా కన్ను మూసింది

## 12

భ్రమర మృతదేహానికి ఉత్తరక్రియలు యథావిధిగా జరిపి, గోవిందలాలు ఇంటికి వచ్చాడు ఆ తరవాత అత దెవ్వరితోనూ మాట్లాడక, తనగదిలో ఒంటరిగా కూర్చొన్నాడు ఆరోజు గడిచింది. చీకటిపడి తెల్లవారింది గోవిందలాలు ఆ రాత్రి నిద్రించలేదు సూర్యోదయం అవుతూనే అతడు గదితలుపులు తెరుచుకుని బయటికి వచ్చేంతలో, అతడి మామగారు - మాధవీనాధసర్కారు - అతడికి ఎదురుపడ్డాడు. సర్కారుకు తన అల్లుడి ముఖకవళికల్లో ఏవో అమానుషఛాయలు కనిపించినై అతడు అల్లుణ్ణి పలకరించలేదు ఇక యీ జన్మలో అతడితో మాట్లాడ గూడదని అత దేనాడో శపథం పట్టాడు.

గోవిందలాలు సరాసరి తన ఉద్యానవనంలోకి వెళ్ళాడు అక్కడ సర్వం శిధిలావస్థలో వున్నది ఎక్కడ చూచినా తుప్పలూ, ముళ్ళపొదలూ పెరిగివున్నవి ఆరామగృహంకూడా గోడలు కూలి వికారంగా వున్నది గోవిందలాలు ఆ గృహం మెట్లమీద కూర్చుని వారుణికొలనుకేసి చూశాడు. ఆ సమయంలో అక్కడ చాలా మంది స్నానాలు చేస్తున్నారు హఠాత్తుగా అతడి మస్తిష్కంలో రోహిణి రూపం మెరిసింది చెవుల్లో ఆమె ఆటలు వినిపించినై.

ఆ కొలను మెట్లమీద రోహిణి వున్నదనుకున్నాడు, గోవిందలాలు అంతలోనే అతడికి శిధిల ఆరామగృహం పక్కనుంచి భ్రమర తనకేసే నడిచివస్తున్నట్టు తోచింది. భ్రమర నవ్వుతున్నది! అదే సమయంలో దూరాన చెట్టుకొమ్మలు కిర్రు మన్నవి గోవిందలాలు అటుకేసి దృష్టి సారించాడు కొమ్మలమీద రోహిణి! ఆమె ప్రసాదపురంలోని తన మేడలో పాడినట్టే, గొంతెత్తి మనోహరంగా పాట పాడుతున్నది

ఒకవైపు భ్రమర, మరొకవైపు రోహిణి!

గోవిందలాలు భ్రమరా రోహిణీ మయమయిన అగ్నికుండంలో దహించుకుపోసాగాడు. అతడి మనోప్రపంచంలో భ్రమరా రోహిణీలు తప్ప మరేమిలేవు. క్రమంగా మధ్యాహ్నమై సూర్యాస్తమయమై లోకాన్ని అంధకారం కమ్మింది. గోవిందలాలు యివేమి గమనించే స్థితిలో లేడు. అతడు అతిదయనీయమైన, దారుణమైన ఉన్మాదావస్థలో వున్నాడు.

నడిరేయి గడిచింది. "ఇదే సమయం! యిక్కడే!" అనే మాటలు గోవిందలాలుకు వినిపించినై. అది రోహిణి కంఠస్వరంలా అతడికి తోచింది.

"ఏమిటి నువ్వనేది, రోహిణీ?" అంటూ గోవిందలాలు లేచి నిలబడ్డాడు. మానసిక వ్యాధిగ్రస్తుడై వున్న అతడికి "ఈ సమయంలోనే నేను వారుణీ కొలనులో మునిగి మరణించాను!" అన్న జవాబు వినిపించింది.

"నన్నూ అందులో పడి మునిగి చావమనా, నువ్వు కోరేది?" అని ప్రశ్నించాడు. వ్యాధిగ్రస్తమైన అతడి మనస్సే అతడికి ప్రత్యుత్తరం యిచ్చింది. "అవును. నీవు మరణించవలసిందే! చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం తప్పదు. ఊఁ త్వరగా..."

గోవిందలాలు చీకటిలో తడుపుకుంటూ కొలనుదగ్గిరకు పోయి, తడబడుతూ మెట్లు దిగి, తల ఎత్తి ఆకాశంలో మిలమిలా మెరుస్తున్న నక్షత్రాలకేసి ఓమారు చూసి, ఒక్క దూకున కొలనులోని అగాధజలాల్లో పడిపోయాడు.

ఏడేళ్ళకిందట కొలనులో ఏ ప్రదేశాన్నుంచి గోవిందలాలు, మృతప్రాయంగా వున్న రోహిణి శరీరాన్ని పైకి తీశాడో, అక్కణ్ణుంచే అతడి మృతదేహాన్ని మర్నాటి ఉదయం గ్రామస్థులు పైకి తీశారు.

